తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | బుధవారం-13- ఆగస్టు - 2025 | సంపుటి : 3 | సంచిక : 78 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి

- వనరులు సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించండి
- అటవీ శాఖపై రివ్యూ మీటింగ్ లో సీఎం రేవంత్

- అమ్రాబాద్, కవ్వాల్ రిజర్వుల్లో పర్యాటక సదుపాయాల విస్తరణ
- అటవీ–రెవెన్యూ శాఖల భూ వివాదాల పరిష్కారానికి సంయుక్త సర్వే
- వరంగల్ కాకతీయ జూ అభివృద్ధి ప్రణాళికలు
- వన్యప్రాణి దాడుల బాధితులకు తక్షణ పరిహారం
- అటవీ అభివృద్ధి పనుల్లో శాఖల సమన్వయం
- కమాండ్ కంట్రోల్ సెంటర్ లో కెమెరా అనుసంధానం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధి పై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సింగపూర్ వంటి దేశాల్లో 30 ఎకరాల్లోనే నైట్ సఫారీలు ఉన్నాయని, మనకు భారీ విస్తీర్ణాల్లో అటవీ ప్రాంతాలు..అందులోనే నదులు, జలపాతాలు ఉన్నందున ఆ వనరులను సద్వినియోగం చేసే ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

మిగతా 2లో



## సిబ్బందికి మూడు రోజులు సెలవులు రద్దు

వర్షా లపై అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జ్ మంత్రులు, అధికారులకు సీఎం సూచన

2లో

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. హైదరాబాద్ విద్యార్థిని మృతి

- రెస్టారెంట్‌లో భోజనం చేసి వస్తుండగా కారును ఢీకొట్టిన ట్రక్కు
- అమెరికాలో ఎంఎస్ పూర్తి చేసిన శ్రీజ



అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన విద్యార్థిని శ్రీజ వర్మ దుర్మరణం చెందింది. భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి ఆమె తన అపార్ట్‌మెంట్ నుంచి భోజనం కోసం కారులో రెస్టారెంటుకు వెళ్లింది. తిరిగి వస్తుండగా కారును ఒక ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీజ తీవ్రంగా గాయపడి మృతి చెందింది. ప్రమాదం జరిగిన సమయంలో ఆమె స్నేహితురాలు కూడా కారులో ఉన్నట్లు సమాచారం. శ్రీజ వర్మ అమెరికాలో ఎంఎస్ పూర్తి చేసింది. సిద్దిపేట జిల్లా రామారుకల గ్రామానికి చెందిన శ్రీనివాస్ వర్మ, హేమలత దంపతులకు శ్రీజ వర్మ, శ్రేయ వర్మ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ కుటుంబం హైదరాబాద్‌కు వలస వచ్చింది. వారు మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ చౌరస్తా సమీపంలోని శ్రీకృష్ణనగర్‌లో నివాసముంటున్నారు. శ్రీనివాస్ వర్మ డ్రైవర్‌గా పని చేస్తుండగా, ఆయన భార్య ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తోంది. చిన్నకూతురు శ్రేయా వర్మ కూడా ఎంఎస్ చేసేందుకు 20 రోజుల క్రితం అమెరికా వెళ్లింది.

## బీసీ గర్జన సభ వాయిదా వేసిన బీఆర్ఎస్

### భారీ వర్ష సూచన నేపథ్యంలో వాయిదా


హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలనే ఉద్దేశ్యంతో బీఆర్ఎస్ పార్టీ కథన భేరి పేరిట నిర్వహించ తలపెట్టిన బీసీ గర్జన సభను మరోసారి వాయిదా వేసింది. భారీ వర్ష సూచన నేపథ్యంలో కరీంనగర్ వేదికగా నిర్వహించ తలపెట్టిన ఈ భారీ బహిరంగ సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కరీంనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నేత గంగుల కమలాకర్.. తన ఎక్స్ ఖాతా వేదికగా ఈ ప్రకటన చేశారు.

మిగతా 2లో

## సైబర్ నేరాల్లో తెలంగాణ టాప్



- సైబర్ నేరాల్లో దేశంలోనే తెలంగాణకు అగ్రస్థానం
- జాతీయ సగటు కంటే పది రెట్లు అధికంగా క్రైమ్ రేటు
- వెల్లడిరచిన జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ)
- నేరాల కట్టడికి కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

సైబర్ నేరాల విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యధికంగా అప్రతిష్ఠను మూటగట్టుకుంది. దేశవ్యాప్తంగా నమోదవుతున్న సైబర్ క్రైమ్ రేటుతో పోలిస్తే తెలంగాణలో దాదాపు 10 రెట్లు అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

మిగతా 2లో



## తెలంగాణలో భారీ వర్షాల ఎఫెక్ట్..

# ఐదు జిల్లాల్లోని పాఠశాలలకు సెలవులు

- పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం.. భారీ వర్షా ల అవకాశం
- కలెక్టర్లు, అధికారులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్
- వరద నియంత్రణ, రక్షణ చర్యలకు ప్రత్యేక దిశానిర్దేశం
- స్కూళ్లు, ఐటీ ఉద్యోగులపై ప్రత్యేక ఏర్పాట్లు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

పశ్చిమ మధ్య బంగాళాకాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలుండటంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈ నెల 13వ తేదీ నుంచి 16వరకు అతి భారీ వర్షాలు కురవనున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో పరిస్థితిని బట్టి విద్యా సంస్థలకు సెలవులు.. ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రానున్న మూడు రోజులల్లో భారీ వర్షాలు కురియనున్న నేపథ్యంలో ఇన్‌ఛార్జ్ మంత్రులకు, ఉన్నతాధికారులకు ముందస్తు చర్యలపై దిశానిర్దేశం చేశారు.

మిగతా 2లో

## నాగార్జున సాగర్‌కు పోటెత్తిన వరద 18 గేట్లు ఎత్తివేత

నల్లగొండ, (తెలంగాణ ముచ్చట్లు)

భారీ వర్షా లు, వరదల నేపథ్యంలో కృష్ణా నదికి వరద పోటెత్తింది. జూరాల నుంచి మొదలుకుంటే నాగార్జున సాగర్ వరకు కృష్ణా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీ వరదకు నాగార్జున సాగర్ నిండు కుండలా మారింది. దీంతో అధికారులు ప్రాజెక్టు 18 గేట్లు 5 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 589.50 అడుగులుగా ఉంది. సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటినిల్వ 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటినిల్వ 310.55 టీఎంసీలుగా ఉంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో 1,86,624 క్యూసెక్కులుగా ఉంది.






## సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసు

# సిట్‌కు బదిలీ

### డీసీపీ రష్మీ పెరుమాళ్ వివరణ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసును సిట్‌కు బదిలీ చేసినట్లు నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆమె మీడియాకు వెల్లడించారు. జులైలో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు చెప్పారు.

మిగతా 2లో


## పుట్టినరోజు జరుపుకుని మరుసటి రోజే మృతి చెందిన ఆర్మీ జవాన్..!

### కాష్మీర్‌లో ఆర్మీ వాహనం ప్రమాదం

ఖమ్మం, (తెలంగాణ ముచ్చట్లు)

ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం సూర్య తండాలో విషాదం నెలకొంది. తండాకు చెందిన బానోతు అనిల్ ఆర్మీ జవాన్‌గా కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. గత రెండు రోజుల క్రితం తోటి జవాన్లతో పెట్రోలింగ్ చేస్తుండగా.. ప్రమాదవశాత్తు వాహనం లోయలో పడిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అనిల్.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. ఈ మేరకు ఆర్మీ అధికారులు అనిల్ సోదరుడికి సమాచారం ఇచ్చారు. తమ సోదరుడు మరణంతో ప్రసాద్ స్పృహ తప్పి పడిపోయాడు అతన్ని అస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మిగతా 2లో






## ఖజానా జువెలర్స్ లో దొంగల బీభత్సం...

# సిబ్బందిపై కాల్పులు

- ఆరుగురు సభ్యుల దొంగల ముఠా దాడి
- అసిస్టెంట్ మేనేజర్ పై కాల్పులు
- దొంగల కోసం గాలిస్తున్న 10 పోలీసు బృందాలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

హైదరాబాద్ శివారు చందానగర్ లో దొంగలు రెచ్చిపోయారు. చందానగర్ లోని ప్రముఖ నగల దుకాణం ఖజానా జువెలర్స్ లో దొంగలు దోపిడీకి యత్నించారు. దొంగతనానికి పాల్పడుతున్న సమయంలో అడ్డుకున్న సిబ్బందిపై దాడి చేయడమే కాకుండా, కాల్పులు కూడా జరిపారు. ఈ కాల్పుల్లో సిబ్బందికి గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేయడంతో దొంగలు పారిపోయారు. పరారైన దొంగల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మిగతా 2లో



## 24 నుంచి మళ్లీ జనహిత పాదయాత్ర

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మలి విడత పాదయాత్ర ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. కరీంనగర్ జిల్లా చొప్పదండిలో ఈ జనహిత పాదయాత్ర ద్వారా మహేశ్‌గౌడ్ మరోమారు ప్రజల్లోకి వెళ్లనున్నారు. యాత్ర షెడ్యూల్‌ను గాంధీభవన్ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. 24న సాయంత్రం 5 గంటలకు మహేశ్‌గౌడ్ చొప్ప దండిలో పాదయాత్ర ప్రారంభిస్తారు. 25న ఉదయం అక్కడే శ్రమదానంచేసి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు.

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : పొద్దిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి

(మొదటి పేజీ తరువాయి)



అటవీ శాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) లో మంత్రి కొండా సురేఖతో కలిసి ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులున్నా తెలంగాణ వాసులు ఇతర రాష్ట్రాల్లోని బందీపూర్, తడోబా వంటి ప్రాంతాలకు పులుల సందర్శనకు వెళుతున్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులకు సందర్శకుల సంఖ్య పెంచేలా సౌకర్యాలు కల్పించాలన్నారు.

అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూ వివాదాల పరిష్కారానికి కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి సంయుక్త సర్వే చేపట్టాలి. వరంగల్ కాకతీయ జూ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో పెద్ద నగరమైన వరంగల్‌లో జూ ను ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని సూచించారు. అటవీ జంతువుల దాడిలో మృతిచెందిన లేదా గాయపడిన వారికి, పశువులు, పెంపుడు జంతువులు కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అందుకు సీఎంఆర్ఎఫ్ నుంచి అవసరమైన మేరకు నిధులు వినియోగించుకోవాలని తెలిపారు. అటవీ శాఖ పరిధిలో చేపడుతున్న రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతుల విషయంలో అటవీ శాఖ, ఆయా పనులు చేపడుతున్న శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నుంచి అనుమతులను సాధ్యమైనంత త్వరగా సాధించాలన్నారు. అడవుల్లో వన్య ప్రాణుల సంరక్షణ, వాటి కదలికలను గమనించేందుకు ఏర్పాటు చేసిన కెమెరాలన్నింటిని కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానించాలి. అటవీ శాఖలో అధికారుల కొరతను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రానికి తగిన సంఖ్యలో ఐఎఫ్ఎస్ అధికారుల కేటాయింపుపై కేంద్రంతో సంప్రదించాలని సూచించారు. అటవీ శాఖలో ప్రమోషన్లు, ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే సిద్ధం చేయాలని శాఖలో ఉత్తమ పని తీరు కనబరిచే వారికి అవార్డులను ఇచ్చే ప్రక్రియను పునరుద్ధరించాలన్నారు. ఈ సమావేశంలో అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సిబ్బందికి మూడు రోజులు సెలవులు రద్దు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాలున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జ్ మంత్రులు, అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. మూడు రోజులు ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు రద్దు చేయాలని సీఎం ఉన్నతాధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌తో పాటు వరద ప్రభావ జిల్లాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని, నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల సేవలు వాడాలని సూచించారు. ఆకస్మిక వరదలు వస్తే ఎయిర్ లిఫ్టింగ్‌కు హెలికాప్టర్లు ఉండేలా చూసుకోవాలని, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని అధికారులకు రేవంత్ రెడ్డి ఆదేశించారు. మొబైల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్న ఆయన హైదరాబాద్‌లో వరదలపై హైడ్రా అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. హైదరాబాద్‌లో హైడ్రా సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని, వరదల ప్రభావంపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ ఆదిశించారు. భారీ వర్షాల సమయంలో ప్రజలు బయటకు రాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, స్కూల్స్, కాలేజీలు, ఐటీ సెక్టార్ ఉద్యోగులకు సంబంధించి అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి, తుమ్మల, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. భారీ వర్షాల దృష్ట్యా ముందస్తు చర్యలపై కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు.

ఈరోజు ఉమ్మడి వరంగల్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, కుమురంభీం, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు భారీ వర్ష సూచనలు ఉన్నాయి. పలు జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలను జారీచేసింది. బుధవారం కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

నేడు యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, హనుమకొండ, జనగామ, వరంగల్ జిల్లాల్లో అతిభారీ వర్షాలు ఉన్నాయని పేర్కొంది. ఐదు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. బుధవారం పెద్దపల్లి, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట, మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 9 జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీచేసింది. భారీ వర్షాల సూచన నేపథ్యంలో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు సూచించారు అంతకు ముందు రేవంత్ రెడ్డి అటవీశాఖపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులు, అధికారులు హాజరయ్యారు. ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలని, అటవీ, రెవెన్యూ భూముల హద్దులు నిర్ధరించాలని సీఎం అధికారులను ఆదేశించారు. జంతువుల దాడి బాధితులకు వేగంగా పరిహారం అందించాలని, అధికారుల ప్రమోషన్లు, అవార్డులకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. అటవీ నిఘా కెమెరాలు ఐసీసీసీకి అనుసంధానం చేయాలని సూచించారు.

## బీసీ గర్జన సభ వాయిదా వేసిన బీఆర్ఎస్

(మొదటి పేజీ తరువాయి)




భారీ వర్ష సూచన కారణంగానే ఈ సభను వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని.. అందులో భాగంగా ఆగస్ట్ 14, 15, 16, 17 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే సూచించిందని వివరించారు. ఈ క్రమంలో ఈ కథన భేరి సభను వాయిదా వేసినట్లు తెలిపారు. అయితే వాతావరణం అనుకూలించిన తర్వాత ఈ సభను నిర్వహించాలని పార్టీ అగ్రనాయకత్వం భావిస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ కథనభేరి సభను మళ్లీ ఎప్పుడు నిర్వహించనున్నది మరికొద్ది రోజుల్లో నిర్ణయించి.. ప్రకటిస్తామని మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు గమనించాలని సూచించారు. అసలు అయితే ఆగస్ట్ 8వ తేదీన కరీంనగర్ వేదికగా ఈ కథన భేరీ సభ నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం తొలుత నిర్ణయించింది. కానీ ఎందుకో.. ఈ సభను ఆగస్ట్ 14వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రకటించింది. కానీ భారీ వర్షాల నేపథ్యంలో ఈ సభను మరోసారి వాయిదా వేశారు. ఈ సభ ఏర్పాటుపై వాయిదాల పర్వం కొనసాగడానికి వెనుక ఉన్న కారణాలు ఏమై ఉంటాయనే ఒక చర్చ అయితే రాజకీయ వర్గాల్లో బలంగా సాగుతోంది.

## సైబర్ నేరాల్లో తెలంగాణ టాప్

(మొదటి పేజీ తరువాయి)

ఈ షాకింగ్ విషయాలను జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) మంగళవారం విడుదల చేసిన 2022 మధ్యంతర డేటా వెల్లడిరచింది. ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా సైబర్ క్రైమ్ రేటు సగటున 4.8 శాతంగా ఉండగా, తెలంగాణలో ఇది 40.3 శాతంగా నమోదైంది. దీంతో ఈ జాబితాలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. దక్షిణాది రాష్ట్రాల్లోనే సైబర్ నేరగాళ్లు ఎక్కువగా క్రియాశీలంగా ఉన్నట్లు ఈ నివేదిక సూచిస్తోంది. తెలంగాణ తర్వాత కర్ణాటక రెండో స్థానంలో ఉంది. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే, మహారాష్ట్రలో సైబర్ క్రైమ్ రేటు 6.6 శాతంగా నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో 4.4, అస్సోంలో 4.9, ఉత్తరప్రదేశ్, ఒడిశాలలో 4.3 శాతం చొప్పున ఉంది. పెద్ద రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్ కేవలం 0.4 శాతం క్రైమ్ రేటుతో మెరుగైన స్థానంలో నిలవడం గమనార్హం. కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఢల్లీ 3.2 శాతం, పుదుచ్చేరి 3.9 శాతం క్రైమ్ రేటుతో సైబర్ నేరాలకు హాట్‌స్పాట్‌లుగా మారాయి. ఢల్లీ పోలీసుల డేటా ప్రకారం, 2024లో సైబర్ మోసాల ద్వారా ఢల్లీ వాసులు రూ. 817 కోట్లు నష్టపోయారు. 2025లో జూన్ 30 నాటికి మొదటి ఆరు నెలల్లోనే రూ. 70.64 కోట్లు కోల్పోయారు. దేశంలో సైబర్ నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఇటీవల లోక్‌సభకు తెలిపారు. ఇందులో భాగంగా 'ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్' ఏర్పాటు చేశామని, ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల కోసం 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్' ప్రారంభించామని వివరించారు. దీంతో పాటు, మహిళలు, చిన్నారులపై జరిగే సైబర్ నేరాలపై ప్రత్యేకంగా దృష్టి సారించేందుకు పోలీస్ విభాగాల్లో ప్రత్యేక యూనిట్లను కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



## స్పష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసు సిట్‌కు బదిలీ

(మొదటి పేజీ తరువాయి)



"ఈ కేసులో మొదట 8 మందిని.. తర్వాత 16 మందిని అరెస్టు చేశాం. అరెస్టయిన వారిలో వైద్యులు, ఏజెంట్లు ఉన్నారు. రెండో కేసులో చనిపోయిన బేబీని చూపించి బాధితుల నుంచి రూ.10లక్షలు నుంచి రూ.20లక్షలు వసూలు చేశారు. డాక్టర్ నమ్రత బ్యాంక్ ఖాతాను నిలిపివేశాం. గైనకాలజీ డాక్టర్ సూరి శ్రీమతి పేరుపై ఉన్న లైసెన్స్ నంబర్, లెటర్ హెడ్స్‌తో అక్రమాలు చేశారు. ఆమె ఫిర్యాదు చేయడంతో మరో కేసు నమోదు చేశాం.

సికింద్రాబాద్‌లో సృష్టి సెంటర్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా నడిపిస్తున్నారు. ఈ సెంటర్‌కు అనుమతులు రద్దయి చాలా కాలమైంది. ధనశ్రీ సంతోషి ప్రధాన ఏజెంట్ కాగా.. మరికొందరిని సబ్ ఏజెంట్లుగా నియమించుకొని నెట్‌వర్క్‌ను విస్తరించారు. విశాఖ నుంచి పిల్లల వైద్యురాలు విద్యుల్లత, వైద్యులు రవి, ఉష పనిచేశారు. ఈ కేసులో సరోగేట్‌గా, అండదానం ఇచ్చే వారిగా కొందరు మహిళా ఏజెంట్లు నటించారు. ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మా వర్కర్స్ కూడా ఈ కేసులో భాగస్వాములుగా ఉన్నారు. 9 నెలల పూర్తవుతున్న గర్భవతులను గుర్తించి సరోగసీ కోసం వచ్చిన తల్లిదండ్రులకు అప్పగించారు. మగ బిడ్డకు రూ.4.5 లక్షలు, ఆడబిడ్డకు రూ. 3లక్షల ధర నిర్ణయించారు. ఇలాంటి సెంటర్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అనుమతులు ఉన్న వాటినే సంప్రదించాలి"అని డీసీపీ రష్మి పెరుమాళ్ సూచించారు.

## పుట్టినరోజు జరుపుకుని మరుసటి రోజే మృతి చెందిన ఆర్మీ జవాన్..!

(మొదటి పేజీ తరువాయి)



అనిల్ మరణ వార్తను కుటుంబంలో తల్లికి భార్యకు తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు.. ఆదివారం(ఆగస్టు 10) రోజున అనిల్, తన పుట్టినరోజుసందర్భంగా తోటి జవాన్లతో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నాడు. కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి, తన భార్య, 7 నెలల బాబుతో సంతోషాన్ని పంచుకున్నాడు. ఈ ఆనందాన్ని పంచుకున్న మరునాడే ఆర్మీ వాహనం లోయలో పడి అనిల్ మృతి చెందడంతో తీవ్ర విషాదాన్ని నింపింద. ఈ విషయాన్ని తెలుసుకున్న తన కుటుంబ సభ్యులు స్నేహితులు గ్రామస్తులు కన్నీరు మునీరుగా విలపిస్తున్నారు. సూర్య తండా గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. అనిల్ మృతి వారి కుటుంబానికే కాదు స్నేహితులకు, గ్రామానికి కూడా తీరని లోటని స్థానికులు అంటున్నారు. అనిల్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని అనిల్ స్నేహితులు కోరుతున్నారు.

## తెలంగాణలో భారీ వర్షాల ఎఫెక్ట్..



## ఐదు జిల్లాల్లోని పాఠశాలలకు సెలవులు

(మొదటి పేజీ తరువాయి)

అకస్మిక వరదలు సంభవించినపుడు ఎయిర్ లిఫ్టింగ్ చేసేందుకు అవసరమైన హెలికాప్టర్స్ ఉండేలా చూసుకోవాలి.ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి. విద్యుత్‌కు సంబంధించి అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునేందుకు వీలుగా మొబైల్ ట్రాన్స్‌ఫర్స్ అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

హైదరాబాద్‌లో వరదలపై హైడ్రా అప్రమత్తంగా వ్యవహరించాలి. 24 గంటలు అందుబాటులో ఉండాలి.అత్యవసర సమయాల్లో ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి. రాబోయే 72 గంటలు అందరూ అప్రమత్తంగా ఉండాలి.లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి.ఎక్కడ ఏం జరిగినా సమాచారం కంట్రోల్ రూంకు చేరేలా చూడాలి. ఉద్యోగులు,సిబ్బంది సెలవులు రద్దు చేసి 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. హైదరాబాద్‌లో ప్రమాద స్థాయికి నీరు చేరిన చోట ప్రజలు వెళ్లకుండా పోలీసు సిబ్బంది అలెర్ట్ చేయాలి.

వర్షాల నేపథ్యంలో మూడు కమిషనరేట్‌ల లో ట్రాఫిక్ నియంత్రణకు లా అండ్ ఆర్డర్ పోలీసుల సహకారం తీసుకోవాలి. వర్షాలు, వరదల పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఎఫ్‌ఎం రేడియోలలో అలర్ట్ చేయాలి. క్లౌడ్ బరస్ట్ సమయాల్లో పరిస్థితులను ఎదుర్కొనేలా సన్నద్ధం కావాలి. పరిస్థితులను బట్టి స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ప్రకటించాలి. ఐటీ ఉద్యోగులు వర్క్ ఫ్రం హోమ్ చేసేలా చర్యలు తీసుకోవాలి. సాధ్యమైనంత వరకు రోడ్లపై ట్రాఫిక్ తక్కువగా ఉండేలా చూడాలి.అత్యవసర టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలి. మీడియా తప్పుడు వార్తలతో భయానక వాతావరణం సృష్టించే ప్రయత్నం చేయొద్దు సమాచార శాఖ మీడియాకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలి. రాబోయే 72 గంటలు అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పనిచేయాలి' అని సూచించారు.



## ఖజానా జువెలర్స్ లో దొంగల బీభత్సం... సిబ్బందిపై కాల్పులు

(మొదటి పేజీ తరువాయి)

గాయపడిన వారిని చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు. దొంగలు తొలుత ఖజానా జువెలర్స్ గేట్ వద్ద ఉన్న సిబ్బందిని గాయపరిచి లోపలకు ప్రవేశించారు. ఆ తర్వాత షాపు లోపల ఎదురు తిరిగిన సిబ్బందిపై కాల్పులు జరిపారు. లాకర్ కీ ఇవ్వడానికి నిరాకరించిన అసిస్టెంట్ మేనేజర్ సతీశ్ పై కాల్పులు జరిపారు. దీంతో ఆయన కాలులోకి ఒక బుల్లెట్ దూసుకెళ్లింది. షాపు లోపల నగలు ఉన్న స్టాల్స్ ను పగులగొట్టారు. తుపాకీతో సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఈ దొంగల ముఠాలో మొత్తం ఆరుగురు సభ్యులు ఉన్నట్టు సమాచారం. దొంగలు దొరికిన కాడికి దోచుకుని పరారయ్యారు. ఎక్కువగా వెండి వస్తువులు చోరీకి గురైనట్టు సమాచారం. దొంగలు జహీరాబాద్ వైపు పారిపోగా... జిల్లా సరిహద్దు పోలీసులను అధికారులు అప్రమత్తం చేశారు. పరారైన దుండగుల కోసం 10 ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో చందానగర్ లో భయానక వాతావరణం నెలకొంది.




## 24 నుంచి మళ్లీ జనహిత పాదయాత్ర

(మొదటి పేజీ తరువాయి)



సాయంత్రం 5 గంటలకు వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో పాదయాత్ర జరుగుతుంది. 26న ఉదయం శ్రమదానం, ఆ తర్వాత వరంగల్ జిల్లా పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కూడా పాల్గొంటారు. కాగా, 26వ తేదీ సాయంత్రం 6 గంటలకు జూబ్లీహిల్స్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తలతో మహేశ్‌గౌడ్ భేటీ కానున్నారు.

అదేవిధంగా ఈ నెల 16వ తేదీన జరగనున్న టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ అధికారిక నిర్ణయం తీసుకోనున్నందున ముందస్తుగా క్షేత్ర స్థాయి నేతలతో మీనాక్షి సమావేశం కానున్నారు. బుధవారం ఉదయం జరిగే జూమ్ సమావేశానికి హాజరు కావాలని డీసీసీ అధ్యక్షులు, పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్‌లకు ఆహ్వానం అందింది.





# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

◆ జిల్లా ఎస్సీ, మానిటరింగ్ కమిటీ సభ్యులు

వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:


ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు అన్నారు. మంగళవారం పెద్దమందడి మండల పరిధిలోని బలిజపల్లి జంగమయ్య పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాఠశాలను సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ మంజులత పాఠశాల బోధన అంశాలు తరగతు గదులు సంపూర్తిగా ఉన్నాయని క్రీడ స్థలాలకు, వంటగది ఇబ్బంది ఉన్నట్లు కమిటీ దృష్టికి తెచ్చారు. అనంతరం పాఠశాల మధ్యాహ్న భోజన పథకంపై విద్యార్థులను వంట మనుషులతో కలిసి పరిశీలించగా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని వంట సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు మాదారి భోజరాజు, డి వెంకటేష్, చిట్యాల వెంకటేష్, కే వెంకట్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# సొమ్ము దాతలది- ఫొటోలు రేవంత్ రెడ్డివి

◆ ప్రభుత్వం నయా పైసా ఇవ్వకుండా ఫోటోలు ముద్రించుకోవడం సిగ్గుచేటు
◆ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:

వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సందర్శనలో భాగంగా.. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రభుత్వ విధానాలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు.




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనపర్తి నియోజకవర్గంలో దశాబ్దాలుగా ప్రజల అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించడానికి అంబులెన్సులు అందుబాటులో ఉండేవి కావని, అనాటి పరిస్థితులలో మాజీ ఎం.పి రావుల.చంద్రశేఖర్ రెడ్డి, ఒక అంబులెన్స్ సమకూర్చినారని తర్వాత తాను మంత్రిగా నియోజకవర్గంలో అన్ని మండలాలకు కొల్లాపూర్, అలంపూర్ నియోజకవర్గలలో 9 అంబులెన్సులు కొన్ని సి.ఎస్.ఆర్ ఫండ్స్ ద్వారా వ్యక్తిగత సొమ్ముతో, శ్రేయోభిలాషులు, స్నేహితులు, దాతల సహకారంతో సమకూర్చడం జరిగిందని వివరించారు.

తాను బాధ్యత వహించి జిల్లా ప్రజల సౌకర్యకోసం సొంతంగా, దాతల సహాయంతో ఏర్పాటు చేస్తే సర్కార్ ఏకానా(నయా పైసా) ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాళ్ల ఫోటోలు ముద్రించుకోవడం సిగ్గుచేటు అని ఘాటుగా విమర్శించారు.

సర్కార్ నిధులు ఇచ్చి స్టీకర్లు అతికించుకుంటే తప్పులేదు కానీ, దాతలు, తాను, శ్రేయోభిలాషులు సమకూర్చిన అంబులెన్స్ లమీద సీఎం.రేవంత్ రెడ్డి ఫోటోలు ముద్రించుకోవడం నిజంగా సిగ్గుచేటైన విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో, గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పి.రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, విజయకుమార్, తిరుమల్, నాగన్న యాదవ్, హేమంత్ ముదిరాజ్, చిట్యాల రాము, సూగూర్ మురళి సాగర్, గులాం ఖాదర్ ఖాన్, జోహేబ్ హుస్సేన్, నీల స్వామి స్టార్ రహీమ్, హారిప్, భాగ్యరాజ్, చంద్రశేఖర్, గొర్ల ప్రేమ్ కుమార్, సూర్యవంశం మణికుమార్, బాలరాజు, ఆలిం, లక్ష్మణ్ గౌడ్, శివ గౌడు, కుమ్మరి రామస్వామి, శిరవాటి శంకర్, తోట శీను తదితరులు పాల్గొన్నారు.






# హర్ ఘర్ తిరంగా,హర్ ఘర్ స్వచ్ఛత కార్యక్రమం

కుషాయిగూడ, తెలంగాణ ముచ్చట్లు:

స్వచ్ఛ భారత్ కార్యక్రమాల భాగంగా, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు కాప్రా సర్కిల్ కుషాయిగూడ డివిజన్ డి మార్ట్ వద్ద హర్ ఘర్ తిరంగా - హర్ ఘర్ స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డి మార్ట్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో చెత్త వేయడం, ఆరుబయట మలమూత్ర విసర్జన జరుగుతున్న నేపథ్యంలో ఆ ప్రదేశాన్ని శుభ్రపరిచి, వాల్ పెయింటింగ్ చేశారు. అదనంగా మొక్కలు నాటి, జడ్పిహెచ్ఎస్ కుషాయిగూడ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. వనమ ఉత్సవంలో భాగంగా వివిధ రకాల ఔషధ మొక్కలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ జోనల్ డీసీ ఎస్డబ్ల్యూఎం గోపాల్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ మధుసూదన్ రావు, స్వచ్ఛ భారత్ జీహెచ్ఎంసీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ యశశ్రీ, మేధా, జ్యోతి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యార్థులు మూడు రంగుల జెండాలతో, కార్డులతో హర్ ఘర్ తిరంగా నినాదాలు చేశారు. తెలంగాణ రైజింగ్ బ్యానర్‌పై విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది సంతకాలు చేసి జాతీయతను ప్రదర్శించారు. ప్రదేశంలో చెత్త పడకుండా నియంత్రించేందుకు డి మార్ట్ యాజమాన్యం సీసీ కెమెరా, మైక్‌ను స్వచ్ఛందంగా అందజేసింది.



# సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ముదిరాజ్

చిల్కానగర్, తెలంగాణ ముచ్చట్లు:

చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ జిహెచ్ఎంసి అధికారులు, కాలనీ సంఘ సభ్యులతో కలిసి రాఘవేంద్రనగర్ కాలనీలో సుమారు 17 లక్షల రూపాయల వ్యయంతో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గీతా ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ, రోడ్డు నిర్మాణ సమయంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని, పనుల వల్ల కాలనీ ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు. నాణ్యతలో లోపాలు తలెత్తితే కఠిన చర్యలు



తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ కోకొండ, కోకొండ జగన్, బాలకృష్ణ గౌడ్, శ్యామ్, బీరప్ప, గడ్డ బాలు, బంటి గౌడ్, రాఘవేంద్రనగర్ కాలనీ సంఘ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, సభ్యులు రవి వర్మ, కృష్ణారెడ్డి, వి.బి.ఎస్.కె. భాస్కరరావు, సత్యనారాయణ, గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి అధికారులతో మల్కాజ్గిరి కార్పొరేటర్ సమీక్ష

మల్కాజ్గిరి, తెలంగాణ ముచ్చట్లు:

మల్కాజ్గిరి మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగ అధికారులతో కార్పొరేటర్ శ్రావణ్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. శివపురి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సఫిలగూడ చెరువు పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

కొత్త బోరెవెల్స్‌కి పైప్‌లైన్ ఏర్పాటు, గుర్రపు డెక్క తొలగింపు, టాయిలెట్ నిర్మాణం, హైటెన్షన్ టవర్ ఏర్పాట్లు, వినాయక సాగర్ పేరిట ఎల్ఈడి బోర్డు అమరిక, గణేశ్ నిమజ్జన ఏర్పాట్లు, గోడలపై చిత్రలేఖనం వంటి సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. పనుల కోసం అవసరమైన నిధులు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో చర్చించి ఆమోదం పొందారు. వర్ష ప్రభావిత ప్రాంతాలపై హైడ్రా సిబ్బందికి అవగాహన కల్పించాలంటూ సూచించారు.ఈ కార్యక్రమంలో డి.ఈ. మహేష్, ఏ.ఈ. నవీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# పాముకాటుతో విద్యార్థిని మృతి

వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు:

మహబూబ్నగర్ జిల్లా మూసాపేట మండలం నందిపేట గ్రామం లో దొడ్ల గౌతమి తండ్రి ఆంజనేయులు సోమవారం రాత్రి ఇంటిదగ్గర నిద్రిస్తున్న సమయంలో పాము కాటుకు గురై మరణించడం జరిగింది. వివరాల్లోకి వెళ్తే,, నందిపేట యుపిఎస్ లో నాలుగో తరగతి చదువుతున్న దొడ్ల గౌతమి పాము కాటుకు గురైన విషయం తెలియక, కుటుంబ సభ్యులు జ్వరం అనుకొని ఉన్నారు. మంగళవారం ఉదయం వరకు గౌతమి పాము కాటు కు, గురైందన్న విషయం కనుక్కొని మహబూబ్నగర్ ఆసుపత్రికి తీసుకెళ్లడం జరిగింది. అప్పటికే గౌతమీ పరిస్థితి విషమించడంతో చనిపోవడం జరిగింది. పోయిన సంవత్సరం కూడా వాళ్ళ నాయనమ్మ, ఇంట్లో పా



ముకాటుకు గురై చనిపోవడం జరిగింది. గౌతమి తల్లిదండ్రులకు పెద్ద కూతురు. ఆడుతూ పాడుతూ, అల్లారు ముద్దుగా, అందరితో కలివిడిగా, ఉండే గౌతమి మరణాన్ని కుటుంబ సభ్యులు,గ్రామ ప్రజలు జిర్ణించుకో లేకపోతున్నారు.తల్లి దండ్రులకు తీరని దుఃఖం మిగిల్చి నందుకు శోక సంద్రంలో మునిగిపోయారు.

# రాహుల్ గాంధీ అరెస్ట్ అప్రజాస్వామీకం

◆ సాయిచరణ్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు

వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:

పార్లమెంటు ఎన్నికలలో ఓట్ల చోరీతో, దొంగ ఓట్లతో బిజెపి పార్టీ అధికారాన్ని కైవసం చేసుకున్న విషయాన్ని పార్లమెంటు ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఇటీవల బట్టబయలు చేసి, ఎన్నికల సంఘాన్ని ఈ అవకాతకలపై సమాధానం చెప్పలేక రాహుల్ గాంధీ ని అరెస్టు చేయడం నీతిమలిన చర్య అని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు తూడుకుర్తి సాయిచరణ్ రెడ్డి మండిపడ్డారు. ఈ సందర్భంగా టి.సాయిచరణ్ రెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీని అరెస్టు ఎందుకు చేయవలసి వచ్చిందో, సూటిగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమాధానం చెప్పడం కోసం ఎన్నికల సంఘం ముందుకు రాని పక్షంలో, రాహుల్ గాంధీ సమక్షంలో ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి, పార్లమెంట్ భవన్ నుండి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయానికి ర్యాలీగా వెళుతున్న సందర్భంగా రాహుల్ గాంధీ నీ అరెస్టు చేయడం, బిజెపి కేంద్రంలో



అధికార దుర్వినియోగానికి పాల్గొనడం పాల్పడడం వారి దుర్బుద్ధికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా, ఎన్నికలు నిర్వహించాల్సిన ఎన్నికల సంఘం బిజెపి పార్టీకి తొత్తుగా మారి, ఎన్నికలను నియమాలను పక్కనపెట్టి ఓటర్ లిస్ట్ ను తప్పుదారి పట్టించిన, దొంగ ఓట్ల తో బిజెపి అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఇట్టి విషయాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు, పార్లమెంట్ అది ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తో పాటు, ఇతర ప్రతిపక్ష ఎంపీలను అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని సాయిచరణ్ రెడ్డి అన్నారు.



# స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల శుభ్రపరచిన నాయకులు

నాగారం, తెలంగాణ ముచ్చట్లు:

స్వచ్ఛ భారత్ కార్యక్రమం, హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల భాగంగా నాగారం మున్సిపాలిటీలో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుభ్రపరిచారు. నేతాజీ నగర్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం, రాంపల్లిలో భగత్ సింగ్ మరియు చంద్రశేఖర్ ఆజాద్ విగ్రహాల వద్ద శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు నాగరాజు, మున్సిపల్ మహిళా అధ్యక్షురాలు జ్యోతి పాండే, ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కాలనీ నివాసులు పాల్గొన్నారు.

# నేడు చర్లపల్లి పారిశ్రామికవాడలో ఉచిత మల్టీ వైద్యశిభిరం

◆ కార్మికులు పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలి

చర్లపల్లి, తెలంగాణ ముచ్చట్లు:

చర్లపల్లి పారిశ్రామికవాడ పారిశ్రామికవేత్తల సంఘం అడిటోరియంలో బుదవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 04 గంటల ఉచిత మల్టీ వైద్యశిభిరం నిర్వహిస్తున్నట్టు చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘం అధ్యక్షుడు డి. శ్రీనివాస్ రెడ్డి చర్లపల్లి ఐలా అధ్యక్షుడు కె. గోవిందరెడ్డిలు తెలిపారు. చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘం, చర్లపల్లి ఐలా, లయన్స్ క్లబ్ అప్ గోల్డెన్ జూబ్లీ, లయన్స్ ల్లబ్ అఫ్ హైదరాబాద్ ఇండస్ట్రీస్ వారి అధ్వర్యంలో జీనియా అనుపత్రి, ఏషియన్ ఇనిస్ట్యూట్ అప్ నెఫ్రాలజీ, రెనోవ డిడిహెచ్ ఆసుపత్రి, ఎమ్ఎస్ఎస్ రెడ్డి లయన్స్ ఐ ఆసుపత్రి వారి సౌజన్యంతో చర్లపల్లి పారిశ్రామికవాడలో జెనరల్ చెకప్, ఆర్థోపెడిక్,



గైనకాలజీ, గుండె, కంటి, నెఫ్రాలాజీ, క్యాన్సర్ స్రీనింగ్ వంటి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిదిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ లు పాల్గొని ప్రారంభిస్తారు. పారిశ్రామికవాడకు చెందిన కార్మికులు వారి కుటుంబ సభ్యులు పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రాఘవేంద్ర స్వామి 354వ ఆరాధన ఉత్సవాలు ముగింపు

**హబ్సిగూడ, తెలంగాణ ముచ్చట్లు:**

హబ్సిగూడ డివిజన్ గణేష్ నగర్‌లోని రాఘవేంద్ర స్వామి దేవాలయంలో 354వ ఆరాధన ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, రాఘవేంద్ర స్వామి ఆశీర్వాదాలతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు పాల్గొన్నారు.



# ఉప్పల్ ప్రధాన రహదారి పనులకు ఊపందించిన ప్రభుత్వం

**ఉప్పల్, తెలంగాణ ముచ్చట్లు :**



ఉప్పల్ ప్రధాన రహదారి సమస్య పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. రహదారి నిర్మాణం, అభివృద్ధి, మరమ్మత్తు పనులను వెంటనే ప్రారంభించి సమయానికి పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, జీహెచ్ఎంసీ అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు.

పరమేశ్వర్ రెడ్డి విజ్ఞప్తికి అనుగుణంగా ఈ రహదారిని జీహెచ్ఎంసీ పరిధిలోకి తీసుకోవాలని మంత్రి వెంకట్ రెడ్డి సూచించగా, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ నిర్మాణానికి అంగీకారం తెలిపారు.

మంగళవారం పరమేశ్వర్ రెడ్డి ఆర్ అండ్ బీ చీఫ్ ధర్మారెడ్డిని కలసి రహదారి పరిస్థితిని వివరించారు. ఎలివేటెడ్ కారిడార్‌తో సంబంధం లేకుండా పనులు వెంటనే చేపట్టాలని కోరగా, ధర్మారెడ్డి కూడా సానుకూల సమాధానం ఇచ్చారు.



# డయాలసిస్ రోగికి ఆర్థికసహాయం

**మల్కాజిగిరి, తెలంగాణ ముచ్చట్లు:**

మల్కాజిగిరి నియోజకవర్గంలోని వినాయక్ నగర్ 137వ డివిజన్ పరిధిలోని వాచ్ పై నగర్‌లో నివసిస్తున్న జ్యోతి అనే వృద్ధురాలికి రెండు కిడ్నీలు దెబ్బతినడంతో డయాలసిస్ చికిత్స ఖర్చుల కోసం ₹10,000 ఆర్థికసహాయం అందించారు. ఈ సహాయాన్ని మైనంపల్లి హనుమంత రావు చేతుల మీదుగా పిట్టల నాగరాజు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పిఎన్ఆర్ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.



# పార్క్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుభారంభం

**నాచారం, తెలంగాణ ముచ్చట్లు:**

నాచారం సరస్వతీ నగర్ కాలనీలో సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన పార్క్ అభివృద్ధి పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. సుమారు నాలుగేళ్ల క్రితం 16 లక్షల రూపాయలు మంజూరు చేయించినప్పటికీ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో, డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ప్రయత్నాలతో మరోసారి 20 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి. మంగళవారం ఈ పార్క్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ఏలాంటి ఆలస్యం లేకుండా పనులు వేగంగా పూర్తి చేసి కాలనీ ప్రజలకు పార్కును అందుబాటులోకి తేవాలి" అని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ బాలకృష్ణ, ఏఈ వినీత్, వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, సరస్వతీ నగర్, బాపూజీ నగర్ కాలనీవాసులు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.





# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుంది

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- ఐక్యతతోఉంటే ఏదైనా సాధించగలం
- మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య
- మాదిగ జర్నలిస్టులకు నామినేటెడ్ పదవి ఇవ్వాలి
- టిఎంజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల నాగేందర్ మాదిగ



**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం హైదరాబాదులోని రవీంద్ర భారతిలో తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బూరుగుల నాగేందర్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఆ సంఘం రెండవ రాష్ట్ర మహాసభ కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని గుర్తు చేశారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులతో పాటు ఇంటి స్థలాలు ఇచ్చే విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులు సమాజంలో ఉన్నత విలువలతో కూడిన వార్తలను రాయాలని సూచించారు. మెరుగైన సమాజాన్ని తీర్చిదిద్దడంలో జర్నలిస్టుల పాత్ర గొప్పదని కొనియాడారు. మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య మాట్లాడుతూ మాదిగలు ఐక్యతతో ఉండి అన్ని రంగాల్లో తమ వాటా కోసం ఉద్యమించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమం తో పాటు ఎన్నో సామాజిక ఉద్యమాల్లో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని అభివర్ణించారు. సృష్టిలో సమాజానికి డప్పు ద్వారా సమాచారాన్ని చేరవేసిన మొట్టమొదటి జర్నలిస్టు మాదిగేనని గుర్తు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, టిఎంఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఇటుక రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సంగీతపు రాజలింగం, మైసా ఉపేందర్ ప్రసంగించారు. టీఎంజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బూరుగుల నాగేందర్ మాదిగ మాట్లాడుతూ మాదిగ జర్నలిస్టులకు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం మానవతా కోణంలో పరిశీలించి పరిష్కరించాలని కోరారు. అనంతరం టీఎంజేఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బూర్గుల నాగేందర్,తక్కల్లపల్లి రాజేందర్ లకు దళితరత్న అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పాల్వాయి బాలయ్య, గౌరవ సలహాదారులు సుంచు లింగయ్య, జిలకర కృష్ణకర్, ప్రధాన కార్యదర్శి తక్కల్లపల్లి రాజేందర్, అధికార ప్రతినిధి పెండ్యాల సుమన్, ఉపాధ్యక్షులు మైలారపు ప్రేమ్ కుమార్, బొల్లెపాక రాజేష్, కాటేపాగ హుస్సేన్, పానుగంటి సురేందర్, కార్యదర్శులు కడియం నాగయ్య, పెద్దింటి శ్రీనివాస్, పుల్ల గళ్ళ శ్రీధర్, సుక్క అశోక్, అంకగళ్ల కరుణాకర్, దుబ్బ నాగేష్ తోపాటు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

# పార్టీలోకి తీసుకున్నప్పుడు తెలియదా..?

- మంత్రి పదవి ఇస్తానని మాటిచ్చారు..
- మంత్రి పదవి ఇవ్వకుండా ఎవరు అడ్డుకుంటున్నారు?
- ఖమ్మంలో ముగ్గురు మంత్రులున్నారు..
- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**



కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన అసంతృప్తిని సోషల్ మీడియా ఎక్స్ వేదిక ద్వారా మరోసారి వ్యక్తపరిచారు.. మాటిచ్చారు.. అంటూ తాజాగా మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే చేసిన హాట్ కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. మీరు మంత్రి పదవి ఇస్తానని మాటిచ్చారు.. ఇచ్చినప్పుడు ఇవ్వండి.. మంత్రి పదవి ఇవ్వకుండా ఎవరు అడ్డుకుంటున్నారు? అని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. "ఇస్తామన్నమాట ఆలస్యమైంది.. సమీకరణాలు కుదరటం లేదు అంటున్నారు.. ఎందుకు సమీకరణలు కుదరటం లేదు..? ఎవరు అడ్డుకుంటారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. పార్టీలోకి తీసుకున్నప్పుడు తెలియదా..? మేము ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని.. పార్లమెంట్ ఎన్నికల సమయంలో రెండవసారి ప్రామిస్ చేసినప్పుడు తెలియదా మేమిద్దరం అన్నదమ్ములం ఉన్నామని.." అంటూ ప్రశ్నించారు. ఇద్దరం అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమే అని, ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి? అని ప్రశ్నించారు. తనకు మంత్రి పదవి రాకుండా ఎవరు అడ్డుకుంటున్నారో చెప్పాలని మండిపడ్డారు.

ఒడ్డు దాటే వరకు ఓడ మల్లయ్య, ఒడ్డు దాటాక బోడి మల్లయ్య అన్న చందంగా ఉందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. 9 మంది ఎమ్మెల్యేలు ఉన్న ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండగా, 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న నల్గొండ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండడం తప్పా అని ప్రశ్నిస్తున్నారు. ఇద్దరం అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమే, ఇద్దరం గట్టి వాళ్లమే ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. ఆలస్యమైనా సరే తాను ఓపిక పడుతా అని, తనకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే అని రాజగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. మునుగోడు ప్రజలకు అన్యాయం జరిగితే రాజ్ గోపాల్ రెడ్డికి అన్యాయం జరిగినట్టేనని ఆయన చెప్పారు. భగవంతుడు ఏ పదవి ఇచ్చినా మునుగోడు ప్రజల కోసమే కానీ తన కోసం కాదనీ రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

# మూసీలో పెరిగిన వరద ప్రవాహం

## మూసారాంబాగ్ వంతెనపై రాకపోకలు బంద్

- వంతెన పైనుంచి రాకపోకలను నిలిపివేసిన పోలీసులు
- అంబర్‌పేట్ నుంచి దిల్‌సుఖ్?నగర్ వెళ్లే వాహనాల దారి మళ్లింపు
- రాకపోకలకు అంతరాయంపై ప్రయాణికుల అసంతృప్తి

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**

హైదరాబాద్ నగరంలో కురిసిన భారీ వర్షాలకు అంబర్‌పేట్ వద్ద మూసారాంబాగ్ వంతెన పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. రోజురోజుకూ వరద ప్రవాహం పెరగడం వల్ల బ్రిడ్జిపై వాహనాల రాకపోకలను ట్రాఫిక్ పోలీసులు నిలిపివేశారు. అంబర్‌పేట్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వెళ్లే వాహనదారులను దారి మళ్లించారు. మలక్‌పేట్ నుంచి ముసారాంబాగ్ బ్రిడ్జి మీదుగా అంబర్‌పేట్ పరిసర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులను కూడా దారి మళ్లించారు. వర్షాకాలంలో తీవ్రమైన సమస్యగా : మలక్‌పేట్ నుంచి వచ్చే వాహనాలను గోల్నాక కొత్త బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగించేందుకు చర్యలు తీసుకున్నారు. మూసారాంబాగ్ బ్రిడ్జి పైనుంచి వరద నీరు ప్రవహించిన ప్రతిసారీ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని వాహనదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన పనులు మొదలు పెట్టి దాదాపు రెండేళ్లయినా కేవలం 20 శాతమే పూర్తవడం గమనార్హం.

`మూసీలో పెరిగిన వరద ప్రవాహం మూసారాంబాగ్ వంతెనపై రాకపోకలు బంద్

మూసీ నదిపై ముఖ్యమైన ప్రాంతాల్లో 15 వంతెనల నిర్మాణానికి ప్రణాళిక జర్గ్గా, కేవలం రెండుచోట్లే పనులు మొదలయ్యాయి. వాటిలో ఓ చోట పనులు అర్ధాంతరంగా నిలిచిపోగా, మిగిలిన ఒక్క పనిని కూడా జీహెచ్ఎంసీ సకాలంలో పూర్తి చేయలేక నానా అవస్థలు పడుతోంది. మూసారాంబాగ్‌లో రెండేళ్ల కిందట హైలెవల్ బ్రిడ్జి పనులు మొదలవగా ఇప్పటికీ కేవలం 20 శాతం పనులే జరిగాయి. నత్తనడకన సాగుతున్న పనులతో అంబర్‌పేట్, మలక్‌పేట్ మధ్య రాకపోకలు సాగించే వాహనదారులు చినుకు పడితే అంతే నరకం చూస్తున్నారు. వాహనదారులు అదనంగా 5 కిలో మీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. జంట జలాశయాల నుంచి మూసీలోకి నీటిని వదిలినప్పుడు నదిలోని ప్రవాహం ముసారాంబాగ్ బ్రిడ్జి అంచు నుతాకేది. పాతకాలం బ్రిడ్జి అయినందున



వరద ఉద్ధృతి పెరిగిన ప్రతి సందర్భంలోనూ ట్రాఫిక్ పోలీసులు ఆ మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపేసేవారు. ఇలాంటి పరిస్థితి మంచిరేవుల తదితర ప్రాంతాల్లో కూడా ఉంటుంది. సమస్య పరిష్కారానికి గత బీఆర్ఎస్ సర్కారు మూసీపై 15 చోట్ల ఎత్తయిన వంతెనలను నిర్మించేందుకు రూ.545 కోట్లతో ముందస్తు ప్రణాళికను సైతం సిద్ధం చేసింది. సన్‌సిటీ, అత్తాపూర్, పీర్జాదిగూడ, మూసారాంబాగ్ ప్రాంతాల్లో బ్రిడ్జీల నిర్మాణానికి మట్టి పరీక్షలు కూడా పూర్తి అయ్యాయి. చివరకు మూసారాంబాగ్ వద్ద జీహెచ్ఎంసీ(గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్), పీర్జాదిగూడలో హెచ్ఆర్‌డీసీఎల్ (హైదరాబాద్ రహదారుల అభివృద్ధి సంస్థ) పనులను చేపట్టాయి. అంతలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిరది. సీఎం రేవంత్‌రెడ్డి మూసీనది పునరుజ్జీవ కార్యక్రమాన్ని చేపడతామనడంతో ఇక్కడ ఫుల్‌స్టాప్ పడిరది. మూసీ నది మాస్టర్ ప్లాన్ అధ్యయనం పూర్తయ్యాకే వంతెనలను నిర్మించాలని సర్కారు నిర్ణయించింది. దాంతో పీర్జాదిగూడలోని పనులను హెచ్ఆర్‌డీసీఎల్ అర్ధాంతరంగా మధ్యలోనే నిలిపేసింది.



# నిద్రకు- పీరియడ్స్ గురించి ఆసక్తికర విషయాలు..

నిద్ర మీ పీరియడ్స్ పై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందని మీకు తెలుసా? ఇది మీ పీరియడ్స్ సక్రమంగా రాకుండా చేస్తుంది. మీరు 6 గంటలు లేదా అంతకంటే తక్కువ సమయం నిద్రపోతే, మీ పీరియడ్స్ సర్కిల్ మారుతుంది. మహిళలను ప్రధానంగా వేధించేది పీరియడ్ ప్రాబ్లమ్స్. పీరియడ్ పెయిన్, పీరియడ్స్ సరిగ్గా రాకపోవడం వంటి వాటితో వారు బాధపడుతుంటారు. ఋతుచక్రం సక్రమంగా రాకపోవడానికి అనేక కారణాలు ఉండవచ్చు. శరీరంలో అవసరమైన పోషకాల లోపం, అనారోగ్యకరమైన జీవనశైలి అలవాట్లు, ఒత్తిడి వంటి అనేక కారణాలు ఋతుచక్రం సక్రమంగా రాకపోవడానికి కారణం కావచ్చు. కానీ చాలా మంది మహిళలకు దీని గురించి తెలియదు. ఈ చెడు అలవాట్లు, నిద్ర లేకపోవడం ఋతుచక్రాన్ని ప్రభావితం చేస్తాయి. దీని కారణంగా పీరియడ్స్ ఆలస్యం కావడమే కాకుండా ఋతుచక్రంపై కూడా ప్రభావం చూపుతుంది. నిద్ర లేకపోవడం వల్ల ఋతుచక్రంపై ఎలాంటి ప్రభావం ఉంటుంది. అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం..

ఋతుచక్రం సక్రమంగా ఉండటానికి ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్, కార్టిసాల్ వంటి హార్మోన్లు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. సరైన నిద్ర లేకపోవడం వల్ల ఈ హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. నిద్ర లేకపోవడం వల్ల శరీరం ఒత్తిడికి గురై కార్టిసాల్ హార్మోన్ స్థాయిలు పెరిగి రుతుచక్రంపై నేరుగా ప్రభావం చూపుతుంది. మీరు ప్రతిరోజూ 6 గంటలు లేదా అంతకంటే తక్కువ సమయం నిద్రపోతే, అది మీ ఋతుచక్రాన్ని ప్రభావితం చేస్తుంది. రాత్రి ఆలస్యంగా మేల్కొని, ఉదయం ఆలస్యంగా నిద్ర లేవడం వంటి చెడు అలవాట్లు కూడా ఋతుచక్రం సరిగ్గా రాకుండా చేస్తాయి. అలాగే, నిద్ర లేకపోవడం వల్ల జీవక్రియ, ఇన్సులిన్ నిరోధకతపై ప్రభావం పడి, ఊబకాయం పెరిగే అవకాశం ఉంది. ఈ కారణాలన్నీ కూడా రుతుచక్రం సక్రమంగా లేకపోవడానికి దారితీయవచ్చు. నిద్ర లేకపోవడం ఒత్తిడి హార్మోన్లను పెంచుతుంది. ఇది పునరుత్పత్తి ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతుంది. సాధారణంగా రుతుచక్రం 21 నుంచి 35 రోజుల మధ్యలో రావాలి. దీనికంటే తక్కువ రోజుల్లో లేదా ఎక్కువ రోజుల్లో పీరియడ్స్ వస్తే దాన్ని క్రమరహిత రుతుచక్రంగా పరిగణించాలి. నిద్ర లేకపోవడంతో పాటు ఒత్తిడి, విటమిన్ ఙ, విటమిన్ దీ12 వంటి ముఖ్యమైన పోషకాల లోపం కూడా రుతుచక్రంపై ప్రభావం చూపుతాయి. ఆరోగ్యకరమైన రుతుచక్రం కోసం మంచి నిద్ర, సరైన ఆహారం తీసుకోవడం, ఒత్తిడి లేకుండా ఉండటం చాలా ముఖ్యం. మీకు ఇలాంటి సమస్యలు ఉంటే, వైద్యుడిని సంప్రదించి సలహాలు తీసుకోవడం ఉత్తమం.


# ఈ ఆకులను ప్రతి రోజు 2 తింటే చాలు.. దెబ్బకు ఆ సమస్యలన్నీ పరారు!



బిల్వపత్ర ఆకులను కేవలం పూజలకు మాత్రమే కాకుండా, ఆరోగ్యానికి ఎంతో మంచిదని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. బిల్వపత్ర ఆకుల్లో ఎన్నో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ ఆకులను క్రమం తప్పకుండా తినడం వల్ల మధుమేహం, జ్వరాలు, గుండె సమస్యల నుంచి రక్షణ పొందవచ్చని నిపుణులు అంటున్నారు. బిల్వ పత్రం (మారేడు ఆకు) అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉంది. ఇది మధుమేహాన్ని నియంత్రించడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో, గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా ఇది చర్మ సమస్యలను నయం చేయడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా ఉపయోగపడుతుంది. బిల్వత్ర ఆకుల్లో విటమిన్ ఎ, విటమిన్ బి 1, విటమిన్ బి 6, విటమిన్ సి, కాల్షియం, ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ ఆకులను రోజూ తింటే అనేక రోగాల నుండి రక్షణ పొందవచ్చు. జీర్ణక్రియ మెరుగుదల: ఆయుర్వేద నిపుణుల ప్రకారం.. బిల్వపత్ర ఆకులు జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. ఇవి కడుపులో వాత, కఫ దోషాలను సమతుల్యం చేస్తాయి. ఇది జీర్ణక్రియను వేగవంతం చేసి, మలబద్ధకం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలను తగ్గిస్తుంది. మధుమేహం నియంత్రణ: బిల్వ పత్రంలో రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించే గుణం ఉంది. ఇది మధుమేహం ఉన్నవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కాబట్టి షుగర్ ఉన్న వారు దీన్ని తీసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి. మలబద్ధకం నివారణ: బిల్వపత్ర ఆకులలోని ఫైబర్, శ్లేష్మం వంటి పదార్థాలు మలాన్ని మృదువుగా చేసి, పేగుల కదలికను సులభతరం చేస్తాయి. దీనివల్ల దీర్ఘకాలిక మలబద్ధకం తగ్గుతుంది. ప్రతిరోజూ ఈ ఆకులను నమలడం వల్ల ప్రేగులలో పేరుకుపోయిన పాత మలినాలు కూడా తొలగిపోతాయి. రోగనిరోధక శక్తి : ఈ ఆకులు రోగనిరోధక శక్తిని పెంచి, జ్వరాలు, ముఖ్యంగా మలేరియా, వైరల్ జ్వరాల నుండి రక్షణ కల్పిస్తాయి. మారుతున్న వాతావరణంలో ఈ ఆకుల కషాయం తాగడం వల్ల జ్వరాల బారినుంచి కాపాడుకోవచ్చు. గుండె ఆరోగ్యం:ఆయుర్వేదం ప్రకారం.. బిల్వపత్ర ఆకులు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలను నియంత్రించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇవి రక్తపోటును కూడా అదుపులో ఉంచుతాయి. బిల్వపత్ర ఆకులను శుభ్రం చేసి ఎండబెట్టి పొడి చేసి తీసుకోవచ్చు. లేదా కషాయంలా తయారుచేసుకుని తాగవచ్చు. ప్రతిరోజూ 510 మి.లీ ఆకుల రసం తీసుకోవడం వల్ల కూడా ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. వేడి నీటితో ఆకుల పొడిని కలిపి కూడా తాగవచ్చు.

# 2030 నాటికి ఈ మూడు ప్రమాదకర వ్యాధులు ఉండవు

బుడాపెస్ట్‌కు చెందిన ఒక వైద్య విద్యార్థి క్యాన్సర్, అంధత్వం, పక్షవాతం "2030 నాటికి పూర్తిగా నిర్మూలించబడవచ్చు" అని వెల్లడిరచిన తర్వాత ఒక ఆశ్చర్యకరమైన వైద్య వాదన ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి అధునాతన టీకాలు, ఆధునిక చికిత్సలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగిస్తున్న తరుణంలో అతని వ్యాఖ్యలు.. ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. వైద్య విజ్ఞాన శాస్త్రం ఎంతో అభివృద్ధి చెందింది. వైద్య శాస్త్రంలో సాంకేతికత, చికిత్సా విధానాలు, రోగ నిర్ధారణ పద్ధతులు ఎన్నో రెట్లు మెరుగయ్యాయి. ఫలితంగా, ప్రజల జీవితకాలం పెరిగింది.. వ్యాధుల నుండి కోలుకునే అవకాశాలు మెరుగుపడ్డాయి.. అత్యంత ప్రమాదకరమైన వ్యాధులను నయం చేయడం ఇకపై కేవలం కల మాత్రమే కాదనే స్థాయికి వైద్య శాస్త్రం అభివృద్ధి చెందింది. వాటిని పూర్తిగా నిర్మూలించడానికి మనం కొన్ని అడుగుల దూరంలోనే ఉన్నట్లు కనిపిస్తోంది. బుడాపెస్ట్‌కు చెందిన ఒక వైద్య విద్యార్థి "క్యాన్సర్, అంధత్వం, పక్షవాతం 2030 నాటికి



పూర్తిగా నిర్మూలించబడవచ్చు" అని ప్రకటించిన తర్వాత ఇటీవల ఒక ఆశ్చర్యకరమైన వాదన.. ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఈ డిజిటల్ సృష్టికర్త ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి అధునాతన టీకాలు, ఆధునిక చికిత్సలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగిస్తున్నారు.

"2030 నాటికి పూర్తిగా నిర్మూలించబడే మూడు వ్యాధులు ఇక్కడ ఉన్నాయి. మొదటిది, క్యాన్సర్. కీమోను మర్చిపోండి, పరిశోధకులు ఇప్పుడు మీ రోగనిరోధక వ్యవస్థను సైన్యంలా కణితులపై దాడి చేయడానికి శిక్షణ ఇవ్వడానికి ఎRచీA క్యాన్సర్ వ్యాక్సిన్‌లను ఉపయోగిస్తున్నారు. వ్యక్తిగతీకరించిన వ్యాక్సిన్‌లు, జన్యు సవరణ, మందులు కూడా చివరి పరీక్ష దశలో ఉన్నాయి. క్యాన్సర్ త్వరలో చికిత్స చేయగలదని, నిర్వహించదగినదని.. ఇకపై ప్రాణాంతకం కాదని చాలా మంది నిపుణులు విశ్వసిస్తున్నారు." "రెండవది, అంధత్వం.. జన్యు సవరణ, మూల కణాలకు ధన్యవాదాలు చెప్పవచ్చు.. రెటీనా వ్యాధులతో బాధపడుతున్న రోగులు తిరిగి చూపును పొందుతున్నారు. ఇప్పటికే ప్రాజెక్టులు ఇద్దరు అంధ రోగులకు తిరిగి చూడటానికి సహాయపడ్డాయి.. ప్రైమ్ ఎడిటింగ్ అనే కొత్త సాంకేతికత వారసత్వంగా అంధత్వానికి కారణమయ్యే జన్యు ఉత్పరివర్తనలను సరిచేయగలదు." "మూడవది, పక్షవాతం. చైనాలో, పూర్తి పక్షవాతం ఉన్న ఇద్దరు వ్యక్తులు మెదడు ఇంప్లాంట్లు, వెన్నుపాము ఉద్దీపనల కలయికను ఉపయోగించి మళ్ళీ నడిచారు. మెదడు అక్షరాలా వెన్నెముక గాయాన్ని దాటవేసి నేరుగా కాళ్ళకు సంకేతాలను పంపింది" అని వైద్య విద్యార్థి క్రిస్ క్రిసాంథౌ జోడిరచారు.

# గోర్లను బట్టి ఆరోగ్యాన్ని తెలుసుకోవచ్చు..?

విటమిన్, ఖనిజ లోపాలు వంటి పోషకాహార లోపాలు తరచుగా గోళ్ళలో మొదట కనిపిస్తాయి. గోళ్ల రంగు నుండి నీరసం వరకు గోర్లు మీకు ముఖ్యమైన ఆరోగ్య సంకేతాలను ఇస్తాయి. గోర్లు మన శరీరంలో ఒక ప్రత్యేక భాగం. దీనిని సౌందర్య ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించరు. గోర్లు మన మంచి ఆరోగ్యానికి దగ్గరి సంబంధం కలిగి ఉంటాయి. నిపుణులు గోళ్ల రంగును చూసి శరీరంలో ఏ సమస్యలు వస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. వైద్యుల మాదిరిగానే మీ గోళ్ళను చూసి మీ ఆరోగ్యం గురించి అంచనా వేయవచ్చు. విటమిన్, ఖనిజ లోపాలు వంటి పోషకాహార లోపాలు తరచుగా గోళ్ళలో మొదట కనిపిస్తాయి. గోళ్ల రంగు నుండి నీరసం వరకు గోర్లు మీకు ముఖ్యమైన ఆరోగ్య సంకేతాలను



ఇస్తాయి. చల్లని లేదా వంకరగా ఉన్న గోర్లు: ఐరన్ లోపం ఈ సమస్యకు కారణమవుతుంది. పాలిపోయిన లేదా వంకరగా ఉన్న గోర్లు ఐరన్ లోపం లేదా రక్తహీనతతో సంబంధం కలిగి ఉంటాయి. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ పరిశోధన ప్రకారం.. కాయిలోనిచియా అనేది గోళ్ల అసాధారణ సమస్య. ఇది అనేక వ్యాధులకు కారణమవుతుంది. విరిగిన గోళ్లు: తరచుగా విరిగిన గోళ్లు సాధారణంగా జింక్, విటమిన్ ఎ లేదా బికాంప్లెక్స్ విటమిన్లు లేకపోవడం వల్ల సంభవిస్తాయి. తగినంత ప్రోటీన్ తీసుకోకపోవడం వల్ల సమస్య మరింత తీవ్రమవుతుంది. ఇండియన్ జర్నల్ ఆఫ్ డెర్మటాలజీ, వెనెరాలజీ అండ్ లాప్రాలజీ (2012) లో జరిపిన ఒక అధ్యయనం ప్రకారం, పెళుసుగా ఉండే నెయిల్ సింద్రోమ్. ఇది ముఖ్యంగా పోషకాహార లోపం ఉన్న రోగులలో సర్వసాధారణం. గోళ్లపై నీలంనలుపు మచ్చలు లేదా రంగు మారడం: గోళ్లపై నల్లటి నిలువు గీతలు, మెలనోమా అని పిలుస్తారు. ఇది తరచుగా విటమిన్ బి12 లోపం వల్ల సంభవించవచ్చు. గోళ్ళపై తెల్లని మచ్చలు : గోళ్ళు చాలా పాలిపోయినట్లు ఉంటే లేదా గోళ్ళ అడుగు భాగం తెల్లగా ఉంటే అది తక్కువ హిమోగ్లోబిన్ లేదా ఫోలేట్ లోపానికి సంకేతం కావచ్చు. ప్రోటీన్, విటమిన్ బి12 లోపాలు కూడా దీనికి కారణం కావచ్చు.



# బార్లీ నీళ్లతో ఆ సమస్యలకు చెక్.. ప్రతి రోజూ తాగితే ఎంత మంచిదో!

ప్రస్తుతం చాలా మంది అనారోగ్య సమస్యలతో సతమతం అవుతున్నారు. ముఖ్యంగా కిడ్నీ, హై కొలెస్ట్రాల్, అధిక బరువుతో అనేక సమస్యలతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారికి బార్లీ నీళ్లు ఓ వరం అనే చెప్పాలి. ఎందుకంటే? వీటిని ప్రతి రోజూ తీసుకోవడం వలన చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంట. ఇది శరీరాన్ని డీటాక్సిఫై చేయడమే కాకుండా, అనేక వ్యాధుల నుంచి బయటపడేలా చేస్తుందంట. ఇక బార్లీ నీటిని ఉదయాన్నే ప్రతి రోజునూ తాగడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంట. ముఖ్యంగా ఇది హైడ్రేషన్, జీర్ణక్రియను మెరుగు పరచడమే కాకుండా, అధిక కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. శరీరాన్ని డిటాక్సిఫై చేస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ రోజూ బార్లీ నీళ్లు తీసుకోవాలని చెబుతుంటారు. బార్లీ నీటిలో ఫైబర్,యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాల పుష్కలంగా ఉంటాయి. అందువలన ఇది కడుపు సంబంధ సమస్యలను తగ్గించి, జీర్ణక్రియ మెరుగు పడేలా చేస్తుంది. ప్రతి రోజూ బార్లీ నీళ్లు తాగడం వలన ఇది గుండెల్లో మంట, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగేలా చేస్తుంది. అంతే కాకుండా మూత్ర పిండాల పనితీరుకు దోహదం చేస్తుంది. మూత్ర పిండాల సమస్యతో బాధపడే వారు ప్రతి రోజూ బార్లీ నీళ్లు తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మంచిదంట.ఈ నీటిని ప్రతి రోజూ తాగడం వలన ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తొలగించి, శరీరాన్ని డిటాక్సిఫై చేస్తుంది. అంతే కాకుండా మూత్రపిండాల పనితీరును మెరుగు పరిచి, కిడ్నీ ఇన్ఫెక్షన్స్, మూత్ర పిండాల్లో రాళ్ల వంటి సమస్యల నుంచి కాపాడుతుంది. గుండె ఆరోగ్యానికి బార్లీ నీళ్లు చాలా మంచివి. ఇవి రక్తపోటును అదుపులో ఉంచి, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. వీటిని ప్రతి రోజూ తాగడం వలన గుండె సమస్యల భయమే ఉండదు అని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు.

# బెల్లీ ఫ్యాట్ ఇట్టే కరిగిపోతుంది..

బెల్లీ ఫ్యాట్‌ని తగ్గించుకోవడానికి మనం అనేక మార్గాలు ప్రయత్నిస్తాము. జిమ్‌కి వెళ్తాము. మేము కఠినమైన ఆహార నియంత్రణలను అనుసరిస్తాము. అయితే, బరువు తగ్గడానికి కొన్ని సాధారణ సహజ మార్గాలు ఉన్నాయి. బెల్లీ ఫ్యాట్‌ను తరిమికొట్టేందుకు మన వంటింట్లో లభించే ఈ చిన్న విత్తనాలు చాలు.. మనం ఎక్కువగా ఉపయోగించే జీలకర్ర బరువు తగ్గడానికి సహాయపడుతుంది.రాత్రి పడుకునే ముందు రెండు చెంచాల జీలకర్రను ఒక గ్లాసు నీటిలో వేయాలి. ఉదయం నిద్రలేచిన తర్వాత ఖాళీ కడుపుతో జీలకర్ర నీటిని మరిగించకుండా తాగాలి. మిగిలిన జీలకర్ర గింజలను కూడా నమిలి మింగేయాలి. ఇది బరువు తగ్గడంలో చాలా సహాయపడుతుంది. మీ బొడ్డు చుట్టూ పేరుకుపోయిన కొవ్వును తగ్గించడంలో జీలకర్ర చాలా ప్రభావవంతంగా ఉంటుంది. ఇది ఆకలిని తగ్గిస్తుంది. మన జీవక్రియను పెంచుతుంది. ఇలా శరీరంలో పేరుకుపోయిన అదనపు కొవ్వును తగ్గించి బరువు తగ్గించేందుకు జీలకర్ర సహాయపడుతుంది. అధిక కొలెస్ట్రాల్ సమస్య ఉన్నవారికి జీలకర్ర చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ఉత్పత్తిని తగ్గిస్తుంది మరియు మంచి కొలె



స్ట్రాల్ స్థాయిని పెంచుతుంది. మీకు గ్యాస్, ఉబ్బరం, అసిడిటీ, మలబద్ధకం సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే, జీలకర్ర మీ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తుంది. జీర్ణక్రియకు ఇది చాలా మంచి ఔషధం. డయాబెటిక్ రోగులకు జీలకర్ర విరుగుడుగా సహాయపడుతుంది. ఇది ఇన్సులిన్ స్థాయిలను పెంచుతుంది. ఐరన్ లోపం అనీమియా ఉన్నవారు తప్పనిసరిగా జీలకర్రను ఆహారంలో చేర్చుకోవాలి. బహిష్టు సమయంలో దీన్ని తీసుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. మొటిమలతో బాధపడేవారికి కూడా జీలకర్ర ఎంతో మేలు చేస్తుంది. ఇది యాంటీ ఫంగల్, యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంది. ఇది ముఖం మీద మొటిమలు, మచ్చలను వదిలించుకోవడానికి సహాయపడుతుంది. ఇది మీ ఆహారంలో చేర్చుకోవడం చాల ముఖ్యం అంటున్నారు నిపుణులు. అంతేకాదు..గర్భిణీలకు కూడా జీలకర్ర నీరు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. గర్భిణీలలో జీర్ణక్రియ మెరుగు పడుతుంది. కార్బోహైడ్రేట్లను జీర్ణం చేసేందుకు అవసరం అయ్యే ఎంజైమ్‌లు ఉత్పత్తి చేస్తుంది. అంతేకాదు.. పాలిచ్చే తల్లులు కూడా రోజూ జీలకర్ర నీటిని తాగడం మంచిది. జీలకర్ర నీటిని తాగడం వల్ల పాలు బాగా ఉత్పత్తి అవుతాయి. జీలకర్రలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్తహీనత రాకుండా చూస్తుంది. తల్లీ బిడ్డలను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీలకర్ర నీటితో శ్వాసకోశ వ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. జీలకర్ర నీటిలోని యాంటీ కంజెస్టివ్ లక్షణాలు ఛాతిలో పేరుకుపోయిన మ్యూకస్ కరిగింపజేస్తుంది. జీలకర్ర నీటిని తాగడం వల్ల శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. ఇందులో పొటాషియం అధికంగా ఉంటుంది. మన శరీర పనితీరుకు ఇది ఉపయోగపడుతుంది. ఇది హైబీపీని తగ్గిస్తుంది. ఉప్పు వల్ల కలిగే దుష్ప్రభావాల నుంచి రక్షిస్తుంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# అమెరికాలో మరోసారి కాల్పులు...

అగ్రరాజ్యం అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం సృష్టించాయి. టెక్సాస్‌లోని ఆస్టిన్ టార్గెట్ పార్కింగ్ స్థలంలో ఒక దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారు. పలువురు గాయపడినట్లు తెలుస్తోంది. టెక్సాస్‌లోని ఆస్టిన్‌లోని టార్గెట్ స్టోర్ పార్కింగ్ స్థలం దగ్గర మానసిక రుగ్మతతో బాధపడుతున్న 30 ఏళ్ల యువకుడు తుపాకీతో కాల్పులకు తెగబడ్డాడు. సంఘటనాస్థలిలోనే ముగ్గురు ప్రాణాలు వదిలారు. అనంతరం నిందితుడు పారిపోతూ రెండు వాహనాలను దొంగిలించాడు. ఆస్టిన్ పోలీస్ చీఫ్ లిసా డేవిస్ మాట్లాడుతూ.. అనుమానితుడిని దక్షిణ ఆస్టిన్‌లో దాదాపు 32 కిలోమీటర్ల దూరంలో పట్టుకున్నట్లు తెలిపింది. అయితే ఈ సంఘటనపై పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పౌరులకు రక్షణ కల్పించడంలో ట్రంప్ ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. దేశానికి మెరుగైన భద్రత అవసరం అంటూ నిలదీశారు. తక్షణమే ట్రంప్, గ్రేగ్ అబాట్ మంగళవారం తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు కేసే నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇక బాధితుల గురించి ఎలాంటి వివరాలు వెల్లడి రచలేదు. నలుగురు బాధితులు ఉండొచ్చని పేర్కొన్నారు. కాల్పులకు కారణాలేంటో కూడా తెలియజేయలేదు. ప్రస్తుతం కేసు అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.



# చైనాపై అదనపు సుంకాలు?

రష్యా నుంచి ముడి చమురును కొనుగోలు చేస్తున్న చైనాపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అదనపు సుంకం విధిస్తారా? భారత్‌పై ట్రంప్ అదనపు సుంకం విధించిన తర్వాత తరచుగా ఎదురవుతున్న ప్రశ్న ఇది. రష్యా నుంచి చమురును కొనుగో లు చేస్తోందన్న కారణంతో భారత్‌పై విధించినట్లుగానే చైనాపై కూడా అదనపు సుంకాన్ని విధించే విషయంలో ట్రంప్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. చైనాతో తమ సంబంధాలు విస్తృతమైనవని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్యానించారు. అమెరికాచైనా సంబంధాల స్వభావం క్లిష్టమైనదని ఆయన చెప్పారు. 'చైనాపై అదనపు సుంకాన్ని విధించే విషయాన్ని పరిశీలిస్తున్నానని ట్రంప్ అన్నారు. అయితే ఆయన ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు' అని వాన్స్ ఫాక్స్ న్యూస్‌కు తెలిపారు. అమెరికాచైనా సంబంధాలను రష్యాతో ముడిపెట్టలేమని వాన్స్ చెప్పారు. ట్రంప్ అనేక అవకాశాలను పరిశీలిస్తున్నారనీ, తన విచక్షణతో నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. 'చైనాతో సంబంధాలకు సంబంధించిన అంశం కొంత క్లిష్టంగానే ఉంటుంది. ఎందుకంటే మా సంబంధాలు అనేక ఇతర అంశాలపై కూడా ప్రభావం చూపుతాయి. రష్యా పరిస్థితితో వాటికి సంబంధమే లేదు' అని వివరించారు. కాగా రష్యా నుంచి చైనా గత నెలలో 10 బిలియన్ డాలర్ల విలువైన చమురును కొనుగోలు చేసింది. గత మార్చి నుంచి జరుపుతున్న కొనుగోళ్లలో ఇదే అధికం. అయితే గత సంవత్సరంతో పోలిస్తే మార్చిజూలై నెలల మధ్య కొనుగోళ్లు 7.7 శాతం తగ్గాయి. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు సమర్థనీయమేనని చైనా స్పష్టం చేసింది. 'రష్యా సహా ప్రపంచ దేశాలన్నింటితోనూ సాధారణ ఆర్థిక, వాణిజ్య, ఇంధన సహకారాన్ని నెలకొల్పుకునే చట్టబద్ధమైన హక్కు చైనాకు ఉంది. మా దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సహేతుకమైన ఇంధన భద్రతా చర్యలు తీసుకుంటాం' అని చైనా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రష్యా నుంచి చైనా జరుపుతున్న చమురు కొనుగోళ్లపై ట్రంప్ హెచ్చరికలు చేసినప్పటికీ ఆయన సలహాదారు పీటర్ నవర్రో మాత్రం బీజింగ్ ఎగుమతులపై కొత్తగా టారిఫ్ విధించే అవకాశాలు లేవని చెప్పారు. అధిక సుంకాలు అమెరికాకు నష్టం కలిగిస్తాయని ఆయన తెలిపారు.



# టర్కీలో భారీ భూకంపం

## అనేక భవనాలు నేలమట్టం

తుర్కియేలోని బలికెసిర్ ప్రావిన్సులో 6.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. భూకంపం ధాటికి 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇస్తాంబుల్‌లోనూ భూమి కంపించిందని అధికారులు వెల్లడిరచారు. సిందిర్గి పట్టణంలో భూకంప కేంద్రం ఉందని, ఆ పట్టణంలో 16 భవనాలు నేలమట్టమయ్యాయని పేర్కొన్నారు. భవన శిథిలాల కింద చిక్కుకొని ఓ యువతి మృతిచెందిందగా, మరో 29 మందికి గాయాలయ్యాయని అధికారులు వెల్లడిరచారు. భవన శిథిలాలను తొలగించేందుకు రెస్క్యూ బృందాలు కృషి చేస్తున్నాయి. మరోవైపు, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ ఆకాంక్షించారు. భూకంప ప్రభావిత ప్రాంతాలలో జరుగుతున్న సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తున్నానని ఎక్స్‌లో పోస్టు చేశారు. 2023లో 7.8 తీవ్రతతో సంభవించిన భూకంపం టర్కీలో మారణహౌమాన్ని సృష్టించింది. భూకంప ధాటికి 53వేలకుపైగా ప్రజలు మృతిచెందగా, వందల్లో భవనాలు నేలమట్టమయ్యాయి. ప్రమాద తీవ్రత గురించి టర్కిష్ మంత్రి అలీ యెర్లికాయ విలేకర్లతో మాట్లాడారు. ఇస్తాంబుల్, పర్యాటక కేంద్రమైన ఇజ్మీర్‌తో సహా దేశంలో పశ్చిమాన ఉన్న అనేక నగరాల్లో భూకంపం సంభవించిదని పేర్కొన్నారు. ప్రమాద స్థలానికి వెంటనే విపత్తు దళాలు చేరుకొని సహాయ చర్యలు ప్రారంభించాయని చెప్పారు. భూకంప ధాటికి 16 భవనాలు కూలిపోయాయన్నారు. మూడు అంతస్తుల భవనం కూలిన ఘటనలో అందులో ఉన్న ఆరుగురు నివాసితులు ఉన్నారని, వారిని రెస్క్యూటీం క్షేమంగా బయటకు తీశారని ఆయన తెలిపారు. అయితే ఓ 80 ఏండ్ల వృద్ధుడు శిథిలాల నుంచి వెలికి తీసిన కొద్ది సేపటికే మరణించారని చెప్పారు.

# పాలస్తీనాను గుర్తిస్తాం : ఆస్ట్రేలియా

సెప్టెంబరులో జరిగే ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాలస్తీనా దేశాన్ని గుర్తిస్తామని ఆస్ట్రేలియా ప్రధాని ఆంతోనీ ఆల్బనేస్ చెప్పారు. పాలస్తీనాను గుర్తిస్తామని బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా దేశాలు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. నిస్సైనికీకరణ జరుపుతామని, ఎన్నికలు నిర్వహిస్తామని, వదిలి వెళ్లేందుకు ఇజ్రాయిల్‌కు ఉన్న హక్కును గుర్తిస్తామని పాలస్తీనా అథారిటీ (పీఏ) హామీ ఇచ్చిందని ఆల్బనేస్ తెలిపారు. మధ్యప్రాచ్యంలో హింసకు స్వస్తి చెప్పేందుకు, ఘర్షణను నివారించేందుకు, గాజాలో ఆకలి మంటలను చల్లార్చేందుకు, ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు రెండు దేశాలు పరిష్కారం కనుగొనాలని మానవాళి కోరుకుంటోందని ఆయన సోమవారం విలేకరులతో అన్నారు. భవిష్యత్తులో పాలస్తీనా వ్యవహారాలలో హమాస్‌కు ఎలాంటి పాత్ర ఉండబోదని పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ హామీ ఇవ్వడంతో తాము ఈ నిర్ణయం తీసుకున్నామని ఆల్బనేస్ వివరించారు. బ్రిటన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్, జపాన్ దేశాల ప్రధానులతో పక్షం రోజులుగా ఇదే విషయంపై చర్చలు జరుపుతున్నానని ఆయన చెప్పారు. ఓ అవకాశం వచ్చిందని, దానిని ఉపయోగించుకునేందుకు అంతర్జాతీయ సమాజంతో కలిసి కృషి చేస్తామని తెలిపారు. గత సంవత్సరం స్పెయిన్, ఐర్లాండ్, నార్వే దేశాలు పాలస్తీనా దేశాన్ని లాంఛనంగా గుర్తించాయి. ఐరాసలోని 193 సభ్య దేశాలలో ఇప్పటి వరకూ పాలస్తీనాను 147 దేశాలు గుర్తించాయి. ఐరాసలో పాలస్తీనాకు 'శాశ్వత పరిశీలక దేశం'గా గుర్తింపు ఉంది. కానీ ఓటింగ్ హక్కులు లేవు. పాలస్తీనాను గుర్తించే ప్రశ్నే లేదని అమెరికా ఇప్పటికే స్పష్టం చేసింది. గాజాలో యుద్ధాన్ని నిలిపివేయాలంటూ ఇజ్రాయిల్‌పై అంతర్జాతీయ సమాజం తీవ్రమైన ఒత్తిడి తెస్తున్న విషయం తెలిసిందే. అయితే పాలస్తీనా దేశాన్ని గుర్తించడమంటే ఉగ్రవాదానికి ఊతమివ్వడమే అవుతుందని ఇజ్రాయిల్ వాదిస్తోంది. కాగా గాజాలో శనివారం నుంచి ఐదుగురు ఆకలి, పోషకాహారలోపంతో ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఇప్పటి వరకూ ఆకలికి తాళలేక చనిపోయిన వారి సంఖ్య 217కు చేరిందని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. 2023లో ఇజ్రాయిల్ సైనిక దాడులు మొదలు పెట్టిన దగ్గర నుంచి ఇప్పటి వరకూ 61 వేల మందికి పైగా ప్రజలు మరణించారని వివరించింది.



# గాజా స్వాధీన ప్రకటనను వెనక్కి తీసుకోవాలి

గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. గాజా సిటీని పూర్తిగా హస్తగతం చేసుకోవాలన్న ఇజ్రాయిల్ ప్రణాళికను బ్రిటన్, ఫ్రాన్స్ సహా అనేక దేశాలు ఎండగట్టాయి. ఈ ప్రణాళిక అంతర్జాతీయ మానవతా చట్టాన్ని ఉల్లంఘిస్తోందని మండిపడ్డాయి. గాజా యుద్ధంపై చర్చించేందు కు ఐరాస భద్రతా మండలి ఆదివారం అత్యవసర సమావేశాన్ని నిర్వహించింది. అంతకుముందు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ హమాస్ నుంచి గాజాకు విముక్తి కల్పిస్తామని, ఆ నగరాన్ని పూర్తిగా తమ అధీనంలోకి తీసుకుంటామని ప్రకటించారు. నెతన్యాహూ ప్రకటనపై డెన్మార్క్, గ్రీస్, స్లొవేనియా కూడా మండిపడ్డాయి. నెతన్యాహూ తన ప్రణాళికను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ ప్రణాళికతో హమాస్ చెరలో ఉన్న బందీలు బయటప డకపోగా, వారి ప్రాణాలు మరింత ప్రమాదంలో పడతాయని ఆందోళన వ్యక్తం చేశాయి. భద్రతా మండలిలోని పలు సభ్య దేశాలు కూడా ఇదే రకమైన ఆందోళన వ్యక్తం చేశాయి. గాజా ప్రజలను శిక్షించడం ఆమోదయోగ్యం కాదని చైనా చెప్పింది. ఇజ్రాయిల్ చర్యలతో శత్రుత్వం మరింత పెరుగుతుందని రష్యా హెచ్చరించింది. సమావేశంలో ఐరాస సహాయ ప్రధాన కార్యదర్శి మిరస్‌లావ్ జెన్కా మాట్లాడుతూ 'ఇజ్రాయిల్ ప్రణాళికను అమలు చేస్తే గాజాలో మరో విపత్తు సంభవిస్తుంది. అది మధ్యప్రాచ్యమంతటికీ వ్యాపిస్తుంది. బలవంతపు తరలింపులు, హత్యలు, విధ్వంసానికి దారితీస్తుంది' అని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఇజ్రాయిల్ చర్యను అమెరికా వెనకేసుకొచ్చింది. బందీలను విడిపించి, యుద్ధాన్ని ఆపేందుకు వాషింగ్టన్ అవిశ్రాంతంగా కృషి చేస్తోందని, ఈ ప్రయత్నాలను సమావేశం అర్థం చేసుకోవడం లేదని అమెరికా రాయబారి దోరోతి షెయా వాపోయారు. తన వద్ద బందీలుగా ఉన్న వారిని హమాస్ వదిలేస్తే యుద్ధం ఈ రోజే ఆగిపోతుందని ఆమె చెప్పారు. ఇజ్రాయిల్ మారణహోమానికి పాల్పడుతోందని నిందించేందుకు ఈ సమావేశాన్ని సభ్య దేశాలు ఉపయోగించుకుంటున్నాయని ఆరోపించారు. కాగా ఇజ్రాయిల్ ప్రణాళికపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో చర్చించానని నెతన్యాహూ తెలిపారు.



# ఓట్ల చోరీపై భగ్గుమన్న ప్రతిపక్షాలు

**న్యూఢిల్లీ:** ఓట్ల చోరీపై ప్రతిపక్షం భగ్గుమంది. ఆధారాలు చూపుతున్నా స్పందించని ఎన్నికల కమిషన్ తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇండియా ఫోరం నేతృత్వంలో వివిధ పార్టీలకు చెందిన 300 మంది ఎంపిలు సోమవారం ఢిల్లీ వీధుల్లో పోరుబాట పట్టారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటు నుండి ఎన్నికల కమిషన్ కార్యాలయానికి మార్చ్ చేపట్టారు. అయితే, వీరి ఆందోళనపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించింది. ఎక్కడికక్కడ బారికేడ్లను ఏర్పాటు చేసింది. ఎంపిల ఆందోళనకు అనుమతి లేదంటూ అరెస్టుల పర్వానికి దిగింది. దీంతో పార్లమెంటు పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా ఎంపిలు చేసిన నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, ఓట్ల చోరీ ఆపాలని ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని ఒకరికి ఒక ఓటు మాత్రమే ఉండాలని ఎంపిలు నినదించారు. అరెస్టుల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఇద్దరు ఎంపిలు స్పృహ తప్పారు. దీంతో పోలీసుల తీరుపై రాహుల్ గాంధీతో పాటు పలువురు నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ల చోరీపై ప్రతిపక్ష ఎంపిలు పోరుబాట పట్టారు. ఇండియా ఫోరం నేతృత్వంలో వివిధ పార్టీలకు చెందిన 300 మంది ఎంపీలు పార్లమెంటు నుండి ఎన్నికల కమిషన్ కార్యాలయానికి మార్చ్ చేపట్టారు. వీరి ఆందోళనకు అనుమతి లేదంటూ పోలీసులు ఎంపిలను అడ్డుకున్నారు. వారిని అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్లకు పోలీసులు తరలించి, ఆ తరువాత విడుదల చేశారు. ఎంపిల మార్చ్ సోమవారం ఉదయం 11.30 గంటలకు పార్లమెంట్ మకరద్వారం వద్ద ప్రదర్శన ప్రారంభమైంది. ఓట్ల చోరీ ఆపాలి, ఎస్ఐఆర్ వెనక్కి తీసుకోవాలన్న నినాదాలు చేస్తూ ఎంపిలు కదిలారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. ''ఎస్ఐఆర్ ప్లస్ ఓట్ తెఫ్ట్ ఈక్వల్ టు మర్డర్ ఆఫ్ డెమొక్రసీ'' అని బ్యానర్లపై రాశారు. ర్యాలీ ట్రాన్స్‌పోర్టు భవన్ వద్దకు ప్రదర్శన వచ్చేసరికి ముందుగానే ఏర్పాటు చేసిన మూడంచెల బారికేడ్లతో ఎంపిలను ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు.




# లోక్‌సభ, రాజ్యసభల్లో చెరో రెండు బిల్లులు ఆమోదం

**న్యూఢిల్లీ:** బీహార్‌లో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ ఉభయ సభల్లో సోమవారం కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. ఉభయ సభలు ప్రారంభమైన కొద్దిసేపటికే వాయిదా పడ్డాయి. అనంతరం ప్రతిపక్ష ఎంపిలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ప్రదర్శన చేపట్టడం, ప్రతిపక్ష ఎంపిలు అరెస్టు కావడంతో తిరిగి ప్రారంభమైన ఉభయ సభల్లో ప్రతిపక్షాలు లేకుండానే చెరో రెండు బిల్లులను ప్రభుత్వం ఆమోదించుకుంది. ఇందులో కీలకమైన నేషనల్ డోపింగ్ బిల్లు, ఆదాయపు పన్ను బిల్లులు ఉన్నాయి.సోమవారం లోక్‌సభను స్పీకర్ ఓంబిర్లా ప్రారంభిస్తూ ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు ప్రయత్నించారు. ప్రతిపక్ష ఎంపిలు ప్లకార్డులు పట్టుకుని వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని, ఓటు చోరీ ఆపాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. వెంటనే సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సభ్యులు అత్యవసర అంశాలను చర్చించాలని రూల్ 267 కింద ఇచ్చిన 29 నోటీసులను తిరస్కరించారు. పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా పడిన తరువాత ప్రతిపక్ష ఇండియా బ్లాక్ ఎంపిలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీ చేపట్టారు. మార్గమధ్యంలోనే వీరిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తిరిగి మధ్యాహ్నం రెండు గంటలకు ఉభయ సభలు ప్రారంభమయ్యాయి. అరెస్టయిన ప్రతిపక్ష ఎంపిలు విడుదల కాకపోవడంతో వారు సభకు హాజరుకాలేదు. దీంతో ప్రతిపక్ష ఎంపిలు లేకుండా సభను నిర్వహించారు.

లోక్‌సభలో కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయా ప్రవేశపెట్టిన జాతీయ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్లు, నేషనల్ యాంటీ డోపింగ్ సవరణ బిల్లులను ఆమోదించారు. అనంతరం ఆదాయపు పన్ను బిల్లును కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు.




## బిజెపి ఇసిని రిగ్గింగ్ యంత్రాంగంగా మార్చింది

**చెన్నై:** ఎన్నికల కమిషన్‌ను రిగ్గింగ్ యంత్రాంగంగా బిజెపి మార్చి వేసిందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే బిజెపి అపహాస్యం చేస్తుంటే మౌనంగా ఉండలేమని ఆయన సోమవారం తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. ప్రతి రాష్ట్రానికీ పూర్తి మెషిన్ రీడబుల్ ఓటరు జాబితాను విడుదల చేయాలని స్టాలిన్ డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ విమర్శలపై స్వతంత్ర దర్యాప్తు చేయాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎలాంటి చర్యలకు పాల్పడినా.. డిఎంకె అందరినీ కలుపుకుంటూ భుజం భుజం కలిపి పోరాటం చేసేందుకు నిలబడుతుందని ఆయన అన్నారు. బెంగళూరులోని మహదేవపురంలో జరిగింది పరిపాలనా లోపం కాదు.. ప్రజల ఆదేశాన్ని దొంగిలించడానికి జరిగిన కుట్ర' అని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ పోస్టుకు లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఇటీవల 2024 సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన అవకతవకల్ని ఎత్తిచూపిన వీడియోను జత చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# ఐసీఐసీఐ విషయంలో జోక్యం చేసుకోలేమన్న ఆర్‌బీఐ




బ్యాంకు పొదుపు ఖాతాల్లో కనీస సగటు బ్యాలెన్స్ (మినిమమ్ బ్యాలెన్స్) పరిమితిని నిర్ణయించుకునే స్వేచ్ఛ పూర్తిగా ఆయా బ్యాంకులకే ఉంటుందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. ఈ విషయం తమ నియంత్రణ పరిధిలోకి రాదని ఆయన తేల్చి చెప్పారు. దేశంలోని రెండో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్ అయిన ఐసీఐసీఐ, కొత్త ఖాతాదారులకు కనీస బ్యాలెన్స్ పరిమితిని భారీగా పెంచిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సోమవారం గుజరాత్‌లో జరిగిన ఒక ఆర్థిక సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న సంజయ్ మల్హోత్రా, ఐసీఐసీఐ బ్యాంక్ కొత్త నిబంధనలపై మీడియా అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. 'కనీస బ్యాలెన్స్‌ను ఎంత ఉంచాలనేది బ్యాంకుల విచక్షణకే వదిలేశాం. కొన్ని బ్యాంకులు ఈ పరిమితిని రూ.10,000గా నిర్ణయిస్తే, మరికొన్ని రూ.2,000గా ఉంచాయి. చాలా బ్యాంకులు ఈ నిబంధనను పూర్తిగా తొలగించాయి కూడా,' అని ఆయన వివరించారు. ఐసీఐసీఐ బ్యాంక్ జారీ చేసిన కొత్త నిబంధనల ప్రకారం, ఆగస్టు 1 తర్వాత ఖాతా తెరిచిన వారు భారీ మొత్తంలో కనీస సగటు బ్యాలెన్స్‌ను పాటించాల్సి ఉంటుంది. మెట్రో, పట్టణ ప్రాంతాల కస్టమర్లు నెలకు సగటున రూ. 50,000 నిర్వహించాలి. సెమీఅర్బన్ (పట్టణాలకు సమీప ప్రాంతాలు) కస్టమర్లు రూ. 25,000 పాటించాలి. గ్రామీణ ప్రాంతాల వారు రూ. 10,000 కనీస బ్యాలెన్స్ కలిగి ఉండాలి. అయితే, పాత కస్టమర్లకు మునుపటి నిబంధనలే వర్తిస్తాయి. మెట్రో, పట్టణ ప్రాంతాల్లో రూ.10,000, గ్రామీణ, సెమీఅర్బన్ ప్రాంతాల్లో రూ.5,000గా పాత పరిమితులు కొనసాగుతాయి. కనీస బ్యాలెన్స్ పాటించని వారి నుంచి తగ్గిన మొత్తంలో 6% లేదా రూ. 500 (ఈ రెండిరటిలో ఏది తక్కువైతే అది) జరిమానాగా వసూలు చేస్తారు. అంతేకాకుండా, నెలకు మూడుసార్లు మాత్రమే ఉచితంగా నగదు డిపాజిట్ చేయవచ్చని, ఆ తర్వాత ప్రతి లావాదేవీకి రూ.150 ఛార్జీ విధిస్తామని బ్యాంక్ ప్రకటించింది. దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 2020లోనే కనీస బ్యాలెన్స్ నిబంధనను రద్దు చేసింది.

# అమెరికా కార్పొరేట్ దిగ్గజాలకు ఆర్థిక నష్టాలు!




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ మీద సుంకాల దాడి చేస్తున్న సంగతి విదితమే. అంతే కాకుండా భారత ఆర్థిక వ్యవస్థపై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. కొన్నిసార్లు భారతదేశాన్ని 'టారిఫ్ కింగ్' అంటూ పిలిచిన ట్రంప్.. మరికొన్నిసార్లు 'డెడ్ ఎకానమీ' అంటూ విమర్శలు గుప్పించారు. అయినా సరే రెండు దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడి సంబంధాలు బలంగానే ఉన్నాయి. 202425 ఆర్థిక సంవత్సరంలో భారత్‌అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 131.84 బిలియన్ల డాలర్లకు చేరింది. ఇందులో భారత్ 86.51 బిలియన్ డాలర్ల విలువైన సరుకులు అమెరికాకు ఎగుమతి చేయగా..45.33 బిలియన్ డాలర్ల విలువైన సరుకులు దిగుమతి చేసుకుంది. భారతదేశం చేసిన ఎగుమతుల్లో ఔషధాలు, రత్నాలు, ఆభరణాలు, ఐటీ ఉత్పత్తులు ఉంటే, దిగుమతులు చేసుకున్న వాటిలో ముడి చమురు, బొగ్గు, విమాన భాగాలు ఉన్నాయి.అయితే ట్రంప్ కొత్తగా ప్రకటించిన 50 శాతం సుంకాలు విషయానికి వస్తే.. అందులో 25 అదనపు జరిమానాలు ఉన్నాయి. ఇవి భారత ఎగుమతులకు పెద్ద అడ్డంకి కావచ్చు. ముఖ్యంగా ఆయన తరచూ భారత్ రష్యాతో చమురు, ఆయుధాల వ్యాపారం చేస్తోందని విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ పరిస్థితిలో భారత్ కూడా ప్రతీకారం తీర్చుకువాలనుకుంటే ఈ అమెరికన్ కంపెనీలు పెద్ద ప్రమాదంలో పడతాయి. ఈ టాప్ కంపెనీలకు పరిమితులుతో పాటు సుంకాలు విధిస్తే ఆ కంపెనీలకే కాకుండా అమెరికా ఆర్థిక వ్యవస్థకు కూడా అది గట్టి షాక్ అవుతుంది. ఇంకా చెప్పాలంటే..అమెరికన్ కంపెనీలు భారత మార్కెట్‌లో ప్రతి రంగంలో గట్టిగా పాతుకుపోయాయి. ఈకామర్స్ నుంచి ఫాస్ట్ ఫుడ్, సాంకేతికత నుంచి బ్యాంకింగ్ వరకు అన్నింటిలో ఆ కంపెనీలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. అమెజాన్ ఇండియా ఇప్పటికే దేశంలోని 97 శాతం పిన్‌కోడ్లను చేరుకుని దాదాపు ప్రతి ఇంటికి యాక్సెస్ సాధించింది. ఇక ఆపిల్ భారతదేశాన్ని ఐఫోన్‌ల కోసం వేగంగా పెరుగుతున్న మార్కెట్‌గా మలుచుకుంది. టెక్ దిగ్గజాలు గూగుల్, మైక్రోసాఫ్ట్ తమ డేటా సెంటర్లు, క్లౌడ్ సేవలు, సాఫ్ట్‌వేర్ లైసెన్సింగ్ ద్వారా విస్తారమైన ఆదాయం భారత్ నుంచి సంపాదిస్తున్నాయి.సోషల్ మీడియా రంగంలో దూసుకుపోతున్న ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ట్విట్టర్ వంటి ప్లాట్‌ఫామ్‌లు కోట్లాది భారతీయుల రోజువారీ జీవితంలో భాగమైపోయాయి. భారత్ వీటికి ఏదైనా పరిమితి విధిస్తే.. నేరుగా ప్రకటనల ఆదాయంపై తీవ్ర ప్రభావం ఉంటుంది.

## నాలుగేళ్ల ఆండ్రాయిడ్ అప్‌డేట్స్‌తో వివో వీ60

ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ వివో.. తన 'వీ' సిరీస్ మరో కొత్త ఫోన్‌ను దేశీయ మార్కెట్లోకి తీసుకొచ్చింది. వివో వీ60 పేరిట దీన్ని లాంచ్ చేసింది. ఫిబ్రవరిలో విడుదల చేసిన వివో వీ50కి కొనసాగింపుగా ఈ ఫోన్‌ను తీసుకొచ్చింది. దీంట్లో స్నాప్‌డ్రాగన్ 7 జన్ 4 ప్రాసెసర్, 50 ఎంపీ కెమెరా ఇచ్చారు.

వివో వీ60లో 6.77 అంగుళాల క్వాడ్‌కర్వ్‌డ్ అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120Hz రిఫ్రెష్‌రేటు, 5,000 నిట్స్ లోకల్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. ఇది ఆండ్రాయిడ్ 15 ఆధారిత ఫన్‌టచ్ ఓఎస్15 ఆధారంగా పనిచేస్తుంది. ఇందులో స్నాప్‌డ్రాగన్ 7 జన్ 4 ప్రాసెసర్ అమర్చారు. నాలుగేళ్ల ఆండ్రాయిడ్ అప్‌డేట్స్, 6 ఏళ్ల సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ చెబుతోంది.







## నాలుగేళ్లలో రూ.4..48 లక్షల కోట్ల ఎన్‌పిఎలు రద్దు

గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంక్ (పిఎస్‌బి)ల్లో రూ.4.48 లక్షల కోట్ల మొండి బాకీలు రద్దు అయ్యాయి. అప్పులు తీసుకున్న సంస్థలు, వ్యక్తులు వడ్డీ లేదా మూలధనం చెల్లింపులను నిలిపివేస్తే.. వాటిని పారు బకాయిలు (ఎన్‌పిఎ)లుగా పరిగణిస్తారు. ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఇటీవల రాజ్యసభకు ఇచ్చిన సమాచారం ప్రకారం.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఆర్థిక సంవత్సరం 202122 నుంచి 202425 మధ్య అత్యధికంగా రూ.80,197 కోట్ల ఎన్‌పిఎలను రద్దు చేసింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ. 68,557 కోట్లతో రెండవ స్థానంలో ఉండగా.. పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ. 65,366 కోట్లతో మూడవ స్థానంలో, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ. 55,279 కోట్లతో, కెనరా బ్యాంక్ రూ. 47,359 కోట్లతో, ఇండియన్ బ్యాంక్ రూ. 29,949 కోట్ల రద్దుతో వరుస స్థానాల్లో ఉన్నాయి. మొత్తం 12 ప్రభుత్వ బ్యాంకులు రూ. 4.48 లక్షల కోట్ల మొండి బాకీలను రద్దు చేశాయి. అయితే 2021 మార్చినాటికి ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో 9.11 శాతంగా ఉన్న మొండి బాకీలు.. 2025 మార్చి నాటికి 2.58 శాతానికి తగ్గాయి.

# అమెరికా నుంచి చైనాకు, మళ్లీ శక్తిమంత చిప్‌లు



అమెరికా నుంచి చైనాకు అత్యాధునిక కంప్యూటర్ చిప్‌లను ఎగుమతి చేసే విషయంలో కీలక ముందడుగు పడిరది. చైనాలో విక్రయాలపై తమకు వచ్చే లాభాల్లో ట్రంప్ సర్కారుకు 15% వాటా చెల్లించేందుకు అమెరికా చిప్ కంపెనీలైన ఎన్‌విడియా, ఏఎండీ అంగీకరించాయి. దీంతో చిప్ ఎగుమతులు తిరిగి ప్రారంభం కానున్నాయి. భద్రతా కారణాలను చూపుతూ చిప్ ఎగుమతులను అమెరికా నిలిపివేయగా.. ప్రతిగా చైనా అరుదైన ఖనిజాల ఎగుమతిపై ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో లాభాల్లో వాటా తీసుకుని చిప్‌ల ఎగుమతికి అమెరికా ప్రభుత్వం అంగీకరించడం గమనార్హం. చైనాకు అత్యాధునిక చిప్‌లను ఎగుమతి చేయడంపై బైడెన్ హయాంలో అమెరికా ఆంక్షలు విధించింది. దీంతో చైనా మార్కెట్ కోసం ఎన్‌విడియా అత్యాధునిక హెచ్20 చిప్‌లను రూపొందించింది. ట్రంప్ అధికారంలోకి వచ్చాక వాటిపైనా ఆంక్షలు విధించడంతో ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా ఎన్‌విడియా భారీగా ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. దీంతో ఎన్‌విడియా సీఈఓ జెన్‌సెన్ హువాంగ్ అటు వాషింగ్టన్‌తోనూ ఇటు బీజింగ్‌తోనూ సంప్రదింపులు జరిపారు. డొనాల్డ్ ట్రంప్‌తో గత వారం సమావేశం తర్వాత ఎన్‌విడియా చిప్‌ల ఎగుమతిపై కీలక ప్రకటన చేశారు.

# ఆఫీస్‌కు వస్తున్నారా?.. ఎలా రావాలో చెప్పిన ఇన్ఫోసిస్

బెంగళూరులో కొత్తగా ప్రారంభించిన నమ్మ మెట్రో ఎల్లో లైన్ సర్వీసులకు భారతదేశంలోని అతిపెద్ద ఐటీ సంస్థల్లో ఒకటైన ఇన్ఫోసిస్ మద్దతుగా నిలుస్తుంది. సుస్థిర ప్రయాణానికి మద్దతు ఇవ్వడానికి కంపెనీ ఉద్యోగులను రోడ్డు రవాణాకు బదులుగా మెట్రోలో ప్రయాణించాలని కోరింది. జయనగర్‌లోని ఆర్‌వీ రోడ్డు నుంచి ఎలక్ట్రానిక్ సిటీ ద్వారా బొమ్మసంద్రను కనెక్ట్ చేసేలా 19.14 కిలోమీటర్ల ఎలివేటెడ్ మెట్రో మార్గాన్ని ఇటీవల ప్రారంభించారు. రోడ్డు ప్రయాణానికి సమర్థవంతమైన ప్రత్యామ్నాయంగా ఈ మెట్రో మార్గాన్ని ప్రమోట్ చేస్తూ ఇన్ఫోసిస్ ఉద్యోగులకు అంతర్గత ఈమెయిల్ పంపించింది. భారీ ట్రెఫిక్ జామ్‌లతో సతమవుతున్న బెంగళూరులో పలు ప్రాంతాలకు సులువుగా ప్రయాణించేలా మెట్రో సర్వీసులు అందుబాటులో వచ్చిన నేపథ్యంలో ఇన్ఫోసిస్ ఈమేరకు ప్రకటన విడుదల చేసింది. కోనప్పన అగ్రహార స్టేషన్ తన ఎలక్ట్రానిక్ సిటీ క్యాంపస్‌కు కీలక నోడ్‌గా ఉంటుందని కంపెనీ తెలిపింది. స్టేషన్ నుంచి ఇన్ఫోసిస్ మెట్రో ప్లాజా వరకు ప్రత్యేకమైన స్కైవాక్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పింది. ఇది క్యాంపస్‌కు ప్రత్యక్ష, సురక్షితమైన ప్రవేశాన్ని అందిస్తుందని పేర్కొంది. ఉద్యోగుల కోసం మెట్రో ప్లాజా వద్ద ఐడీ ఆధారిత ఎంట్రీ ప్రోటోకాల్స్ పాటించనున్నట్లు స్పష్టం చేసింది.




# భారీగా తగ్గిన పసిడి ధరలు



పసిడి ప్రియులకు గుడ్ న్యూస్.. ఆగస్టు ఫస్ట్ వీక్ నుండి పెరుగుతూ వచ్చిన పసిడి ధరలు రెండు రోజుల నుంచి తగ్గుముఖం పడుతున్నాయి. ఈ రోజు 100 గ్రాముల పసిడి ధర రూ.8, 800 తగ్గింది. భారత్‌అమెరికా దేశాల మధ్య సుంకాల వార్ దెబ్బకి బంగారం ధరల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆగస్టు 2 నుంచి 10 గ్రాముల ధర దాదాపు రూ. 6 వేలకు పైగానే పెరిగింది. తాజాగా పసిడి ప్రియులకు కొంచెం ఊరట కలిగిస్తూ ధరలు తగ్గాయి. రానున్న పండుగ సీజన్ నేపథ్యంలో బంగారం ధరలు ఇంకా తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆగస్టు 12 మంగళవారం బంగారం ధరలను పరిశీలిస్తే..24 క్యారట్ల గ్రాము బంగారం ధర 88 రూపాయిలు తగ్గింది. ప్రస్తుతం గ్రాము బంగారం ధర రూ.10,140 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారట్ల గ్రాము బంగారం ధర 9,295 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 18 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ.7,605 వద్ద ట్రేడ్ అవుతోంది. 100 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.8,800 తగ్గి రూ. 10,14,000 వద్ద ట్రేడ్ అవుతోంది. అలాగే 22 క్యారట్ల బంగారం ధర 100 గ్రాములు రూ.8000 తగ్గి రూ. 9,29,500 వద్ద ట్రేడ్ అవుతోంది. 18 క్యారట్ల %Gశీశ్రీస% ధర రూ.6,600 తగ్గి 100 గ్రాములు రూ.7,60,500 వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ నగరంలో నేడు బంగారం ధరలను చూసినట్లయితే 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,01,400 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.92,950 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.76,050 గా నమోదైంది.

# అందుబాటు ధర ఇళ్ల అమ్మకాలు తగ్గొచ్చు

భారత ఎగుమతులపై అమెరికా విధించిన సుంకాల కారణంగా సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి కంపెనీలు (ఎంఎస్‌ఎంఈ), వాటి ఉద్యోగుల ఆదాయంపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రూ.45 లక్షల లోపు ధర ఉండే అందుబాటు గృహాల విక్రయాలు దెబ్బతినే అవకాశం ఉందని స్థిరాస్తి సేవల సంస్థ అనరాక్ తెలిపింది. ప్రధానంగా ఈ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులే ఈ ఇళ్లను కొంటారని పేర్కొంది. అమెరికా ఎగుమతుల్లో ఎంఎస్‌ఎంఈల వాటా గణనీయంగా ఉంటుంది. అధిక సుంకాల వల్ల వాటి ఉత్పత్తులు, ఇతర దేశాలతో పోటీపడే అవకాశం కోల్పోయే ఆస్కారం ఉంది. ఈ పరిస్థితుల్లో వాటికి ఆర్డర్లు తగ్గే ఆస్కారం కనిపిస్తోంది. ఇది ప్రధానంగా ఉద్యోగులపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని అనరాక్ వెల్లడిరచింది. కొవిడ్19 మహమ్మారి తర్వాత అందుబాటు గృహాల విక్రయాలు, కొత్త ప్రాజెక్టుల ప్రారంభం తగ్గిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల కాలంలో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో 1.9 లక్షల ఇళ్లు అమ్ముడైనప్పటికీ, వీటిలో కేవలం 34,565 యూనిట్లు మాత్రమే అందుబాటు ధరలవి ఉన్నాయి. ఇప్పటికే తీవ్రంగా దెబ్బతిన్న ఈ విభాగానికి సుంకాలు పెద్ద ప్రతికూలంగా మారబోతున్నాయని, మిగిలిన కొద్దిపాటి ఆశలనూ నాశనం చేసే అవకాశముందని అనరాక్ రీసెర్చ్, అడ్వైజరీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రశాంత్ ఠాకూర్ తెలిపారు. డెవలపర్లు ఇక నుంచి అందుబాటు ధరల ఇళ్ల ప్రాజెక్టులను ప్రారంభించేందుకూ సందేహిస్తారని పేర్కొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# కారు వివాదంపై స్పందించిన నిధి అగర్వాల్

హరిహర వీరమల్లు కథానాయిక నిధి అగర్వాల్ తాజాగా ఒక అనుకోని వివాదంలో చిక్కుకుంది. ఇటీవల భీమవరంలో ఒక స్టోర్ ప్రారంభోత్సవానికి వెళ్లిన సందర్భంగా ఆమె ప్రభుత్వ వాహనంలో ప్రయాణిస్తూ కనిపించడం చర్చనీయాంశంగా మారింది. ఆ వీడియో ఈ రోజు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఇది అధికార దుర్వినియోగం కాదా.. పవన్ కళ్యాణ్ పక్కన కథానాయికగా నటిస్తే.. ప్రభుత్వ వాహనంలో తిరగనిస్తారా అంటూ సోషల్ మీడియాలో విమర్శలు మొదలయ్యాయి. ముఖ్యంగా వైసీపీ వాళ్లకు ఈ వీడియో ఆయుధంగా మారింది. ఈ వీడియో వైరల్ అయిన నేపథ్యంలో నిధి అగర్వాల్ స్పందించింది. తన పేరుతో ఒక ప్రెస్ నోట్ రిలీజ్ చేసింది. తనకు ప్రభుత్వం ఈ వాహనం సమకూర్చలేదని.. ఈవెంట్ నిర్వాహకులే ఆ వాహనం ఇచ్చి పంపారని ఆమె వెల్లడిరచింది. దీనికి ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేసింది. 'ఇటీవల భీమవరంలో ఓ స్టోర్ ప్రారంభోత్సవానికి వెళ్లిన సందర్భంగా జరిగిన పరిణామాలపై సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలు నా దృష్టికి వచ్చాయి. ఈ విషయంలో నేను స్పష్టత ఇవ్వాలనుకుంటున్నా. ఈవెంట్ నిర్వాహకులు నా కోసం ఏర్పాటు చేసిన వాహనం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానిది. అందులో నా పాత్ర ఏమీ లేదు. ప్రభుత్వ అధికారులే నా కోసం వాహనాన్ని పంపినట్లు రాస్తున్నారు. అవి నిరాధారమైన వార్తలు. ఈ విషయంలో నాకెలాంటి సంబంధం లేదు. ప్రభుత్వ అధికారులెవరూ నాకు ఎలాంటి వాహనం పంపలేదు. నా అభిమానులకు వాస్తవాలను చెప్పడం నా బాధ్యత. ప్రతి విషయంలోనూ ప్రేమ, సహకారం అందిస్తున్న అభిమానులకు థ్యాంక్స్'' అని నిధి స్పష్టం చేసింది.

# కూలీ టికెట్ రేట్ల మీద హాట్ డిస్కషన్

తెలంగాణలో కూలీ టికెట్ రేట్ల గురించి పెద్ద డిస్కషన్ జరుగుతోంది. ఇంకా అధికారిక జీఓ బయటికి రానప్పటికీ ఏ క్షణంలోనైనా వచ్చే సూచనలున్నందున దాంట్లో వివరాలు లీకుల రూపంలో చక్కర్లు కొడుతున్నాయి. వాటి ప్రకారం నైజాం మల్టీప్లెక్సుల్లో కూలి చూడాలంటే 350 నుంచి 453 రూపాయల దాకా చెల్లించుకోవాలనే వార్త మూవీ లవర్స్ గుండెల్లో బాంబులు పేలుస్తోంది. ఇదే కూలి చెన్నైలో దీంట్లో సగం రేట్ కే అందుబాటులో ఉండటం గమనార్హం. ఒకే కార్పొరేట్ మల్టీప్లెక్సులోనే రెండు నగరాల్లో వేర్వేరు ధరలు ఉండటం పట్ల సినీ ప్రియులు భగ్గుమంటున్నారు. వార్ 2 సైతం ఇంచుమించు ఇదే స్ట్రాటజీ పాటించనుందని సమాచారం. ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉన్నదో తెలియాలంటే అధికారిక జీఓ బయటకి రావాల్సిందే. ప్రాక్టికల్‌గా చూస్తే రెండు డబ్బింగ్ సినిమాలే.



ఒరిజినల్ వెర్షన్లు కాదు. జూనియర్ ఎన్టీఆర్, నాగార్జునలు నటించి స్వంతంగా డబ్బింగ్ చెప్పినంత మాత్రాన స్ట్రెయిట్ అయిపోవు. ఆ మాటకొస్తే వార్ 2 మొదటి టార్గెట్ హిందీ ఆడియన్స్. కూలి ఫస్ట్ ప్రిఫరెన్స్ తమిళనాడు ప్రేక్షకులు. అలాంటిది ఏపీ తెలంగాణలో మాత్రమే ఇంత ప్రేమ ఎందుకు చూపించాలనేది సగటు అభిమానుల ప్రశ్న. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇంచుమించు ఇదే హైక్ రావొచ్చనే ప్రచారం జోరుగా ఉంది. ఇలా జరగడం ఇదే మొదటిసారి కాదు. ఐ నుంచి భారతీయుడు 2 దాకా ఎన్నోసార్లు ఇలా పెంపులు తెచ్చుకుని వసూళ్లు చేసుకున్న దాఖలాలు చాలా ఉన్నాయి. తెలుగు సినిమాలు తమిళనాడు, కేరళకు వెళ్ళినప్పుడేమో మనకు సరిపడా థియేటర్లు ఇవ్వడానికి అక్కడి డిస్ట్రిబ్యూటర్ సవాలక్ష కారణాలు చెప్పి తగ్గిస్తారు. చిరంజీవి నుంచి కిరణ్ అబ్బవరం దాకా అందరూ ఈ సమస్యను ఫేస్ చేశారు. కానీ ఎవరూ ఏం చేయలేని పరిస్థితి. కానీ మన దగ్గర మాత్రం రజని, సూర్య, విక్రమ్ హీరో ఎవరైనా సరే హైకులు ఇవ్వడానికి ముందు ఉంటామనేది ప్రేక్షకుల ఆవేదన. ఇది వ్యాపారం, ఎవరి ఇష్టం వారిదని చెప్పడానికి లేదు. సినిమా బాగుంటే ఎలాంటి పెంపులు లేకపోయినా రంగస్థలం లాంటి సినిమాలు చరిత్ర సృష్టించాయి. అలాంటి రోజులు మళ్ళీ ఎప్పటికి వచ్చేనో.

# ఒక్కరైనా 10 కోట్లు సంపాదించారా?



తమ వేతనాలు 30 శాతం పెంచాలంటూ సినీ కార్మికులు చేస్తున్న సమ్మె టాలీవుడ్‌ను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. ఈ సమ్మె వల్ల గత కొన్ని రోజులుగా షూటింగ్స్ ఆగిపోయాయి. ఇప్పటికే సినిమా సక్సెస్ రేట్ తగ్గిపోయి.. నష్టాలు పెరిగిపోయి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న నిర్మాతలు.. ఇప్పుడిలా జీతాలు పెంచితే అది మోయలేని భారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో మూడేళ్లుగా జీతాలు పెంచని నేపథ్యంలో పెరుగుతున్న ధరల మధ్య తామెలా బతకాలని కార్మికులు అంటున్నారు. ఈ నేపథ్యంలో మధ్యే మార్గంలో ఫిలిం ఛాంబర్ కొన్ని ప్రతిపాదనలు చేయగా.. దాని మీద అంగీకారం కుదరట్లేదు. ఈ పరిస్థితుల్లో టాలీవుడ్లో చిన్న నిర్మాతలు కలిసి ఒక ప్రెస్ మీట్ పెట్టారు. ఇందులో హనుమాన్ ప్రొడ్యూసర్ చైతన్య నిర్మాతల దీన స్థితి గురించి మాట్లాడారు. కొవిడ్ తర్వాత నిర్మాతల పరిస్థితి దుర్భరంగా మారిందని.. లాభాలు అందుకుంటున్న సినిమాలు బాగా తగ్గిపోయాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండేళ్లలో పరిస్థితి మరి ఇబ్బందికరంగా మారిందని.. ఈ రెండేళ్లలో రూ.10 కోట్లకు పైగా లాభం అందుకున్న ఒక్క నిర్మాతను అయినా చూపించండి అంటూ ఆమె సవాలు విసిరారు. తాము ఐటీ శాఖకు సమర్పించే పుస్తకాలన్నీ తీసుకొస్తానని.. మిగతా నిర్మాతలవీ చూడాలని.. ఎవ్వరైనా పది కోట్లకు మించి లాభం సంపాదించారేమో చూడాలని ఆమె అన్నారు. డబ్బులు తీసుకెళ్లి మరే రంగంలో పెట్టుబడిగా పెట్టినా గ్యారెంటీ ఉంటుందని.. భూమి మీద పెడితే మంచి రిటర్న్ వస్తాయని.. కానీ సినీ రంగంలో మాత్రం పెట్టిన డబ్బులకు గ్యారెంటీ లేదని ఆమె అన్నారు. అయినా సరే సినిమా మీద ఇష్టంతోనే ఇండస్ట్రీలో కొనసాగుతున్నామన్నారు.

# మల్టీస్టార్లకు షాకిస్తున్న చిన్న సినిమా

అదేంటి రెండు అతి పెద్ద మల్టీస్టారర్స్ నువ్వా నేనా అని తలపడుతుంటే మధ్యలో చిన్న సినిమా ప్రస్తావన ఏమనుకుంటున్నారా. వివరాలు చూస్తే మీకూ ఆశ్చర్యం కలుగుతుంది. కాకపోతే ఇది మన రాష్ట్రంలో కాదులెండి. వెస్ట్ బెంగాల్ లో ఆగస్ట్ 14న ధూమ్ కేతు అనే బెంగాలీ మూవీ రిలీజవుతోంది. ఇది ఇప్పటికే పలుమార్లు వాయిదా పడి ఎట్టకేలకు మోక్షం దక్కించుకుంటోంది. మాములుగా హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్, రజనీకాంత్ లాంటి వాళ్ళు రేస్ లో ఉన్నప్పుడు వేరే వాళ్ళు క్లాష్ కి రిస్క్ చేయరు. కానీ ధూమ్ కేతు ప్రొడ్యూసర్లు సై అంటే సై అని ప్రకటన ఇచ్చి బుకింగ్స్ మొదలుపెట్టేశారు. ట్విస్ట్ ఏంటంటే ధూమ్ కేతు ఇప్పటిదాకా 18 వేలకు పైగా టికెట్లు అమ్మగా వార్ 2 దీనికన్నా చాలా వెనుకబడి కేవలం 5 వేల టికెట్లను దాటింది. ఇక కూలి గురించి చెప్పాల్సిన పని లేదు. సింగల్ డిజిట్ లోనే ఉంది. అయితే ఈ ట్రెండ్ కేవలం పశ్చిమ బెంగాల్ కు మాత్రమే పరిమితం. పరిస్థితి గమనించిన యష్ రాజ్ ఫిలింస్ ధూమ్ కేతుకి అదనంగా కొన్ని థియేటర్లు, షోలు ఇవ్వడానికి అంగీకరించిందట. ఇక్కడ అసలైన ట్విస్ట్ మరొకటి ఉంది. ధూమ్ కేతు కొత్త సినిమా కాదు. పది సంవత్సరాల క్రితం మొదలై 2017లో షూటింగ్ పూర్తి చేసుకుంది. కాకపోతే ల్యాబ్ లో మగ్గుతూ ఇన్నేళ్ల తర్వాత మోక్షం దక్కించుకుంది. ఈ పరిణామం పట్ల బెంగాలీ ట్రేడ్ సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తోంది. మాములుగా ఇలాంటి ఆలస్యమైన సినిమాలకు క్రేజ్ ఉండదని, అందుకే బిజినెస్ ఆఫర్లు తక్కువగా ఉంటాయని, కానీ స్టార్ క్యాస్టింగ్ వల్ల ధూమ్ కేతుకి హైప్ వచ్చిందని అభిప్రాయపడ్డారు. కొన్ని విచిత్రాలు ఇలాగే ఉంటాయి.






# 300 కోట్లు సాధ్యమేనా నరసింహా

మహావతార్ నరసింహ సినిమా టైటిల్ కు తగ్గట్టే ఉగ్ర నరసింహావతారం చూపిస్తోంది. ఒకపక్క బ్రేక్ ఈవెన్లు కాక బడా ప్రొడ్యూసర్లు తలలు పట్టుకుంటే ఒక యానిమేషన్ మూవీ ఈ స్థాయిలో విధ్వంసం సృష్టించడం ఎవరూ ఊహించలేదు. నిన్నటితో రెండు వందల కోట్ల క్లబ్బులో అడుగులు పెట్టిన ఈ చిత్రం నెక్స్ట్ టార్గెట్ గా ట్రిపుల్ సెంచరీని పెట్టుకుంది. అయితే టచ్ కావడం కొంచెం కష్టంగానే ఉంది. ఎందుకంటే గురువారం ఒకే రోజు వార్ 2, కూలీ రెండూ రిలీజ్ కాబోతున్నాయి. ఇప్పటికే ఉన్న అంచనాల దృష్ట్యా వీటికి థియేటర్లు సర్దడమే ఎగ్జిబిటర్లకు మహా కష్టంగా ఉంది. అలాంటిది పాత సినిమాలు కొనసాగించే సీన్ లేదు. మెయిన్ సెంటర్స్ మినహాయించి తక్కువ స్క్రీన్లు అందుబాటులో ఉన్న బిసి కేంద్రాల్లో మహావతార్ నరసింహకు సెలవు ఇవ్వక తప్పదు. వీకెండ్ బుకింగ్స్ ఇప్పటికీ స్ట్రాంగ్ గా ఉన్నాయని, మూడో వారం వీకెండ్ లో కూడా టికెట్లు దొరకని పరిస్థితి మాములుగా పుష్ప లాంటి ప్యాన్ ఇండియా సినిమాలకు చూస్తామని, కానీ మహావతార్ నరసింహ వాటికి ధీటుగా నిలుస్తోందని ట్రేడ్ టాక్. ఇప్పటికీ చూడకుండా మిస్సయిన వాళ్ళు ఎట్టి పరిస్థితుల్లో థియేటర్లోనే ఎక్స్ పీరియన్స్ కావాలని వారాంతం టికెట్ల కోసం ఎదురు చూస్తున్నారు. హైక్ లేకుండా సాధారణ ధరలకే అమ్మడం నిర్మాతలకు సానుకూలంగా మారింది. లెక్కల సంగతి పక్కనపెడితే యునానిమస్ టాక్ తో దూసుకుపోయిన మహావతార్ నరసింహ ఫిలిం మేకర్స్ కు ఒక లెసన్ లాంటిది. కంటెంట్ బాగుంటే జనం ఎంతగా నెత్తి మీద పెట్టుకుని చూస్తారనడానికి ఇంత కన్నా ఉదాహరణ అక్కర్లేదు.

# కుర్రభామలకు గట్టిపోటీ ఇస్తున్న త్రిష



సౌత్ ఇండస్ట్రీలో తోపు హీరోయిన్. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా అందం, అభినయంతో సినీ పరిశ్రమను ఏలేస్తోంది. తెలుగుతోపాటు తమిళం, మలయాళం భాషలలో బ్యాక్ టూ బ్యాక్ హిట్స్ అందుకుంటూ ఇప్పటికీ టాప్ హీరోయిన్ గా దూసుకుపోతుంది. ఓవైపు ఆమె నటించిన చిత్రాన్ని భారీ విజయాన్ని అందుకుంటున్నా.. పలు కారణాలతో నిత్యం వార్తలలో ఉంటుంది త్రిష. ఇటీవలే పొన్నియిన్ సెల్వన్, లియో వంటి హిట్స్ తర్వాత త్రిష క్రేజ్ మరింత పెరిగింది. ఇప్పుడు అజిత్ సరసన విడాముయార్చి, గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రాలతో మరిన్ని హిట్స్ ఖాతాలో వేసుకుంది. 'జోడి' సినిమాలో చిన్న పాత్రలో కనిపించిన తర్వాత మౌనం పెసియాదే మూవీతో హీరోయిన్‌గా గుర్తింపు పొందింది. తక్కువ సమయంలోనే పాన్ ఇండియా లెవల్లో తనదైన ముద్ర వేసింది. ఇప్పుడు దక్షిణ భారతదేశంలో అత్యంత డిమాండ్ ఉన్న నటిగా, అత్యధిక పారితోషికం తీసుకునే హీరోయిన్ గా మారింది. నివేదికల ప్రకారం త్రిష ఆస్తులు రూ.85 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ప్రస్తుతం ఒక్కో సినిమాకు రూ.5 కోట్ల వరకు పారితోషికం తీసుకుంటుందట. అలాగే బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్, ప్రమోషన్స్ ద్వారా త్రిష సంపాదిస్తుంది.

త్రిష చెన్నైలోని ప్రతిష్టాత్మక ప్రాంతంలో ఒక అందమైన, విలాసవంతమైన బంగ్లాను కలిగి ఉంది. అన్ని ఆధునిక సౌకర్యాలతో ఉన్న ఈ ఇంట్లో తన కుటుంబంతో కలిసి నివసిస్తుంది. హైదరాబాద్‌లోని కూడా ఆస్తి ఉందని సమాచారం. ఇక త్రిష వద్ద మెర్సిడెస్‌బెంజ్ ఎస్‌క్లాస్, 5 సిరీస్, రేంజ్ రోవర్ ఎవోక్ వంటి అధునాతన ఖరీదైన కార్లు ఉన్నాయి. ఈ కార్లు వారి స్టార్‌డమ్, ఆర్థిక స్థితిని మరింత హైలైట్ చేస్తాయి. త్రిష చేతిలో ప్రస్తుతం అనేక భారీ బడ్జెట్ సినిమాలు ఉన్నాయి. త్రిష స్టార్ హీరోయిన్ గా దూసుకుపోతుంది. కాగా ఈ అమ్మడి వయసు 42 .. అయినా కూడా తరగని అందంతో కుర్రకారుని కట్టిపడేస్తుంది ఈ చిన్నది. ఏమాత్రం తగ్గని వన్నెతో కుర్ర హీరోయిన్స్ కు గట్టి పోటీ ఇస్తుంది. ఈ ముద్దుగుమ్మ లేటెస్ట్ ఫోటోల పై నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.

# విడుదలకు ముందే 'కూలీ' రికార్డు

**సూపర్ స్టార్ రజనీకాంత్, లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రం కూలీ. అగ్ర నటులు నాగార్జున, ఆమిర్ ఖాన్, ఉపేంద్ర, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం ఇండిపెండెన్స్ డే కానుకగా ఆగష్టు 14న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ మూవీకి సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్ ఇండియాతో పాటు ఓవర్సీస్ అంతటా మొదలైన విషయం తెలిసిందే. తాజాగా నార్త్ అమెరికాలో క్రేజీ రికార్డును అందుకుంది ఈ చిత్రం. విడుదలకు ఇంకా రెండు రోజులు ఉండగానే ప్రీ బుకింగ్స్ సేల్స్‌తోనే రెండు మిలియన్ల క్లబ్‌లో చేరిపోయింది. దీంతో నార్త్ అమెరికాలో ప్రీమియర్స్‌తోనే ఈ స్థాయిలో వసూళ్లు సాధించిన మొదటి తమిళ సినిమాగా రికార్డు నెలకొల్పింది.**



# విడాకుల రూమర్స్ వేళ.. హన్సిక పోస్ట్ వైరల్..

టాలీవుడ్ అందాల నటి హన్సిక తన భర్త సోహైల్‌తో విడాకులు తీసుకుంటుందంటూ కొద్ది రోజులుగా రూమర్స్ వస్తున్నాయి. తన భర్తతో ఆమెకు పడటం లేదని అందుకే వేరుగా ఉంటోందని పుకార్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం హన్సిక తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి తమ పెళ్లి ఫోటోలను డిలీట్ చేసింది. తాజాగా ఆమె విడాకుల రూమర్స్ వస్తున్న వేళ సోషల్‌మీడియా ఆమె పెట్టిన పోస్ట్ వైరల్ అవుతోంది. హన్సిక ఆగస్టు 9న పుట్టినరోజు జరుపుకుంది. ఈ నేపథ్యంలో ఆమెకు సోషల్‌మీడియాలో కుటుంబసభ్యులు, సన్నిహితులు, అభిమానులు పెద్దఎత్తున విషెస్ తెలిపారు. వాటికి హన్సిక స్పందిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో స్టోరీ పెట్టింది. ''ఈ సంవత్సరం నాకు అడగకుండానే ఎన్నో పాఠాలు నేర్పించింది. నాలో నాకే తెలియనంత బలం ఉందని తెలియజేసింది. ఈ పుట్టినరోజున మీ అందరి శుభాకాంక్షలతో నా హృదయం ఉప్పొంగింది. చాలా ప్రశాంతంగా ఉంది. ఒక్కోసారి చిన్న విషయాలు కూడా ఆనందాన్నిస్తాయి. ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు'' అని పోస్ట్ చేసింది. దీంతో మరోసారి హన్సిక విడాకుల గురించి సోషల్‌మీడియాలో చర్చ ప్రారంభమైంది. 2022లో హన్సిన తన చిన్ననాటి స్నేహితుడైన సోహైల్‌ను వివాహం చేసుకుంది. కాగా, సోహైల్‌కి ఇది రెండో పెళ్లి. మొదటి పెళ్లికి హన్సిక హాజరైంది కూడా. అయినా కూడా సోహైల్ మొదటి భార్యతో విడాకులు తీసుకోవడంతో హన్సిక అతడికి మరింత చేరువైంది. ఆ తర్వాత వీళ్లిద్దరూ పెళ్లి చేసుకున్నారు. 'లవ్ షాదీ డ్రామా' పేరుతో వీళ్ల పెళ్లిని డాక్యుమెంటరీగా విడుదల చేశారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in